ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 17 ఏప్రిల్ 2024


శబరి శ్రీరామక్షేత్రంలో వధూవరులుగా సీతారాములు

ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	39.7	37.0	41.0	41.0	37.0
కనిష్ఠం	26.5	28.0	27.0	26.0	27.0

రాములోరి పెళ్లికి రారండి!

- నేడు శ్రీరామ నవమి
- వైష్ణవాలయాలు, బాబా మందిరాల్లో వేడుకలు
- శబరి శ్రీరామ క్షేత్రంలో కల్యాణోత్సవం


నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 16 : దేశమంతటా.. ముఖ్యంగా ప్రతి పల్లెలో జరుపుకునే వేడుక శ్రీరామ నవమి. ధర్మానికి ప్రతీక శ్రీరామచంద్రుడు. ఆయన జన్మదినమే శ్రీరామనవమి. బుధవారం జిల్లా అంతటా ఆ పండుగ జరుపుకోవడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రముఖ ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు మొదలవుతున్నాయి. అన్ని వైష్ణవాలయాలు, హనుమాన్ మందిరాలు, సాయిబాబా మందిరాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. సముద్ర తీరప్రాంతపు పట్టపుపాళేల్లో ఈ ఏడాది నవమి వేడుకలు భారీగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. పైగా ఇది ఎన్నికల ఏడాది, గురువారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమవుతుండటంతో శ్రీరామనవమి వేడుకలకు వివిధ పార్టీలు సహకారం అందిస్తున్నా యి.

శబరి శ్రీరామక్షేత్రంలో కల్యాణోత్సవం

జిల్లాకే తలమానికంగా నెల్లూరులోని శబరి శ్రీరామ క్షేత్రంలో నవమి వేడుకలు జరుగుతున్నాయి. సీతారాముల కల్యాణం కోసం భారీ వేదిక ఏర్పాటు చేశారు. సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలను తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణశర్మ, లలిత దంపతులు అందజేస్తారు. ముత్యాల తలంబ్రాలను 1వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జీ కపర్ది, గాయత్రి దంపతులు సమర్పిస్తున్నారు. నవమి వేడుకల్లో భాగంగా శబరి శ్రీరామ క్షేత్రంలో పసుపు దంచడం, సీతామహాలక్ష్మిని పెండ్లి కుమార్తెను చేయడం, తలంబ్రాలు కలపడం తదితర కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆర్టీసీ.. చార్జీలతో దోచేసి!

- ఐదేళ్లలో రెండుసార్లు వడ్డన
- కిలోమీటరు, స్టేజి, సర్‌చార్జీల పేరుతో బాదుడు
- జిల్లావాసులపై రూ.216 కోట్ల భారం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 16 : ఆర్టీసీ బస్సు ఎక్కాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితులను వైసీపీ పాలకులు తీసుకొచ్చారు. గడిచిన ఐదేళ్ల కాలంలో రెండు విడతలుగా ఆర్టీసీ చార్జీలు పెంచగా, బస్సు ఎక్కాలం టేనే భయపడే స్థాయికి ప్రయాణికులు చేరిపోయారు. 2019-22 మధ్య కాలంలో కిలోమీటర్ల వారీగా పల్లె వెలుగు నుంచి అమరావతి సర్వీసుల వరకు చార్జీలు పెంచగా, 2022-24 కాలంలో స్టేజీలు, సర్‌చార్జీల రూపంలో మరింత ఎక్కువగా ప్రజల నుంచి చార్జీలు గుంజుకున్నారు. పెద్దగా పెంచినట్లు కనిపించకుండానే వైసీపీ ప్రభుత్వం జిల్లా ప్రజల నుంచి గడిచిన ఐదేళ్లలో సుమారుగా 216 కోట్ల రూపాయలు పిండుకుంది.

2019 నుంచే బాదుడు..

వైసీపీ అధికారంలోకి రాగానే 2019 సంవత్సరంలో డిసెంబరు 10వ తేదీన ఆర్టీసీ చార్జీలను పెంచింది. పల్లె వెలుగు సర్వీసు నుంచి అమరావతి సర్వీసు వరకు కిలోమీటరు చొప్పున చార్జీలను పెంచారు. డీజిల్ ధర పెరడంతో సెస్ మాత్రమే పెంచామని దీంతోనే ఆర్టీసీ చార్జీలు పెరిగాయంటూ కేంద్రంపై నిందపోపుతూ 2022 ఏప్రిల్ 14వ తేదీ రాత్రి రాష్ట్ర ప్రభుత్వం మరోమారు ఆర్టీసీ చార్జీలను పెంచింది. అయితే పెరిగిన చార్జీలను ప్రయాణికులు గమనిస్తే సెస్‌తోపాటు టోల్‌ప్లాజా ధరలు, కిలోమీటర్లు వారీగా ప్రభుత్వం బాదేసింది. సెస్ ధరలు పెంచితే ఆర్డనరీ బస్సులపై రూ.2 నుంచి ఏసీ బస్సులపై పది రూపాయల వరకు మాత్రమే ప్రయాణికులపై భారం పడాల్సి ఉంటుంది. అయితే పెంచిన చార్జీలను గమనించిన ప్రయాణికులు ఇదేం దోపిడీ అని ఆశ్చర్య పోయారు. ఇక స్టేజీల వారీగా రూ.5 నుంచి 10 వరకు టికెట్టుపై పెంచి ప్రయాణికుల నడ్డివిరిచారు.

రూ.216 కోట్లు పిండేశారు!

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పడంతో ప్రజలంతా కొత్త బస్సులు వస్తాయి.. మెరుగైన సౌకర్యాలు కల్పిస్తారు.. చార్జీల భారం తగ్గిస్తారని భావించారు. అయితే, వైసీపీ పాలకులు మాత్రం గడిచిన ఐదేళ్లలో రెండు సార్లు చార్జీలు పెంచి జిల్లాప్రజలపై రూ.216 కోట్ల భారం మోపారు. వైసీపీ అధికారం చేపట్టేనాటికి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నెల్లూరు రీజియన్‌లో 10 డిపోలు ఉండేవి. రోజుకు రీజియన్ రాబడి సుమారు రూ.60 లక్షలు ఉండేది. అయితే 2019, డిసెంబరులో ఆర్టీసీ చార్జీలు పెంచిన తర్వాత రీజియన్ రాబడి రోజుకు రూ.75 లక్షలు అయ్యింది. అంటే రోజుకు జిల్లా ప్రజలపై రూ.10 లక్షలు, నెలకు రూ.3 కోట్లు, రెండేళ్లకు రూ.72 కోట్ల అదనపు భారం పడింది. 2022, ఏప్రిల్‌లో మరోమారు ఆర్టీసీ చార్జీలు పెరిగాయి. అప్పటివరకు రోజుకు సుమారు రూ.75 లక్షలు ఉన్న ఆర్టీసీ జిల్లా రాబడి సుమారు రూ.95 లక్షల నుండి 1.05 కోట్లకు వెళ్లింది. అంటే రోజుకు రూ. 20 లక్షల వరకు అదనపు భారం ప్రజలపై పడింది. ఈ క్రమంలో అంటే నెలకు రూ.6 కోట్లు, రెండు రెండేళ్లకు రూ.144 కోట్ల భారం ప్రజలపై పడింది. ఐదేళ్లలో ఆర్టీసీ చార్జీల పెంపుతో జిల్లా ప్రజలపై రూ.216 కోట్ల భారం మోపింది.

11 కొత్త బస్సులతో సరి..

వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలో కాలం చెల్లిన బస్సుల వివరాలను ఆర్టీసీ అధికారులు పంపారు. జిల్లాకు 50 కొత్త బస్సులను కేటాయించాలని ఆ నివేదికలో కోరారు. అయితే ఇప్పటివరకు 11 బస్సులు మాత్రమే పంపారు. జిల్లాలో 600లకుపైగా ఆర్టీసీ బస్సులు ఉండగా వాటిలో సంగానికిపైగా కాలం చెల్లినవేనని ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు. వీటి స్థానంలో కొత్తవి కేటాయించక పోవడంతో ఉన్న బస్సులనే మరమతులు చేయించి నడుపుతున్నారు. ఓ పక్క కాలం చెల్లిన బస్సులు మరో పక్క అధ్వానపు రోడ్లతో ఎక్కడ పడితే అక్కడ బస్సులు నిలిచిపోతూ ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. ఇక బస్టాండ్లలో వసతుల కల్పనపై ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

సోమశిలలో 8.523 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 16: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారానికి ప్రాజెక్టులో 8.560 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 128, ఉత్తర కాలువకు, దక్షిణ కాలువకు 10 క్యూసెక్కులు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు.

వినియోగానికి తగినట్లు పరికరాలుండాలి

- విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్

నెల్లూరు, (జడ్పీ), ఏప్రిల్ 16: వేసవిలో ఎండలు మండుతుండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతుందని, ఇందుకు అణుగుణంగా నాణ్యమైన వైర్లు, పరికరాలను గృహాల్లో ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజ యన్ వినియోగదారులకు సూచించారు. విద్యుత్ భవన్ లోని ఆయన చాంబర్ నుంచి జిల్లాలోని అధికారులతో మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిపై వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావాలని అధి కారులను ఆదేశించారు. లోడ్‌కి తగ్గట్టుగా గేజ్ వైర్లు, ఎర్త్ వైర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తడి చేతులతో స్విచ్‌లను తాకకూడదన్నారు. జిల్లాలోని ఏఎస్‌పేట, అనంతసాగరం, ఆత్మకూరు రూరల్, వింజమూరు, కావలి, దుత్తలూరు, ఇం దుకూరుపేట, సీతారామపురం, కొరుటూరు సెక్షన్లలో జేఐ ఎస్ సర్వే పూర్తి కాలేదని, ఆ సెక్షన్లలో వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

సివిల్స్‌లో వినీష విజయం

- నెల్లూరు యువతికి 821వ ర్యాంక్


వినీష

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 16 : యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ తుది ఫలితాల్లో జిల్లాకు చెందిన బడభాగ్ని వినీష సత్తా చాటారు. నెల్లూరు నారాయణలో పదో తరగతి వరకు చదువుకున్న ఆమె హైదరాబాద్ నారాయణలో ఇంటర్ పూర్తి చేసి ఉమ్మడి రాష్ట్రంలో ఏడవ ర్యాంకు సాధించారు. అనంతరం చెన్నై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేసి అమెరికాలో ఎంఎస్ పూర్తి చేశారు. గతేడాది గ్రూప్-1కు ఎంపికై ప్రస్తుతం విజయవాడలోని సీఆర్‌డీఏలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎవరి వద్ద శిక్షణ తీసుకోకుండానే తాజాగా సివిల్స్‌నులోనూ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఉదయగిరి మండలం, గంగులవారి చెరువుపల్లి తమ సొంత గ్రామమని, తండ్రి శ్రీనివాసరాజు వ్యవసాయాధికారిగా, తల్లి విజయభారతి వ్యవ సాయ కమిషన్ కార్యాలయంలో జేడీగా పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగరీత్యా ఎక్కువకాలం నెల్లూరులో పని చేయడంతో తాము నగరంలోనే స్థిరపడ్డామని చెప్పారు. సమాజానికి సేవ చేయాలన్న కోరికతోనే కఠిన సవాళ్లను ఎదుర్కొని సొంత ప్రిపరేషన్‌తో 821వ ర్యాంకు సాధించానని తెలిపారు.

రేపటి నుంచి కోదండ రాముడి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) : ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామ స్వామి ఆలయంలో గురువారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో దుర్గయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాలు ఈనెల 27వతేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 24న ఉదయం కల్యాణం, 25న రథోత్సవం జరుగుతాయని తెలిపారు.

రేపటి నుంచే కౌంట్‌డౌన్!

- మరో కొద్ది గంటల్లో ఎన్నికల నోటిఫికేషన్
- ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- మహా సంగ్రామంలో కీలకఘట్టం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం


ట్రయల్ రన్ నిర్వహించి నామినేషన్ స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల మహా సంగ్రామానికి సమయం ఆసన్నమైంది. మరో 24 గంటల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుంది. గురువారం ఉదయం ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రకటిస్తారు. అదేరోజు 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలవు తుంది. ఈ నెల 25వతేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. సెలవు రోజు మినహా మిగిలిన రోజుల్లో మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయ వచ్చు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. నెల్లూరు పార్లమెంటుతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారు. బుధవారం శ్రీరామనవమి కావడంతో మంగళ వారమే నామినేషన్ల ట్రయిల్ రన్‌ను కలెక్టర్ పూర్తి చేశారు. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణపై రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. నామినేషన్ పత్రాలు కూడా వారం రోజుల కిందటే జిల్లాకు చేరుకోగా వాటన్నిటినీ అన్ని రాజకీయ పార్టీలు, పోటీకి ఆసక్తి కలిగిన స్వతంత్ర అభ్యర్థులకు అందజేశారు. చాలా మంది రెండేసి సెట్లు చొప్పున నామినేషన్ పత్రాలను తీసుకెళ్లారు. ఇప్పటికే చాలా వరకు ఆ నామినేషన్ పత్రాలను అభ్యర్థులు పూర్తి చేశారు. ఈ నెల 18, 19వ తేదీల్లో మంచి ముహూర్తాలు ఉండడంతో ఆ రెండు రోజుల్లో ఎక్కువగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భారీ కేడ్లు, చెక్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థితోపాటు ఐదు గురికి మించి నామినేషన్ వేసేందుకు వీలు లేదు కాబట్టి అభ్యర్థి వెంట వచ్చే వారిని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే నిలిపేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక ఇప్పటివరకూ ఎన్నికల ప్రచారాల ఖర్చులను పార్టీల లెక్కల్లోకి వేస్తున్న ఎన్నికల సిబ్బంది నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి అభ్యర్థుల ఖాతాల్లో వేయనున్నారు. అందుకోసం ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. నోటిఫికేషన్ సమయం దగ్గరకు రావడంతో జిల్లాలో రాజకీయ వేడి పెరిగింది. ఏ ఇద్దరు కలిసినా రాజకీయాల గురించే చర్చించుకుంటుండడం విశేషం.

ఆర్వోల వివరాలు..

నియోజకవర్గం	నామినేషన్ల కేంద్రం	రిటర్నింగ్ అధికారి	ఫోన్ నెం.
నెల్లూరు పార్లమెంటు	నెల్లూరు కలెక్టరేట్	ఎం హరినారాయణన్	9849904051
కందుకూరు	కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం	జీ విద్యాధరి	8712622671
కావలి	కావలి ఆర్డీవో కార్యాలయం	వీకే శీనానాయక్	9849904054
ఆత్మకూరు	ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం	కే మధులత	9963474101
కోవూరు	కోవూరు తహసీల్దార్ కార్యాలయం	సేదు మాధవన్	9849904052
నెల్లూరు సిటీ	మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం	వికాస్ మర్మత్	9849906609
నెల్లూరు రూరల్	నెల్లూరు ఆర్డీవో కార్యాలయం	ఏ మలోల	9849904055
సర్వేపల్లి	వెంకటాచలం ఎంపీడీవో కార్యాలయం	బీ చిన్న ఓబులేసు	9492406788
ఉదయగిరి	ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం	ఎం రాజారమేష్ ప్రేమ్‌కుమార్	9704073919

నామినేషన్ల ట్రయల్ రన్

నెల్లూరు (హరనాథపురం) : కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం నామినేషన్ల స్వీకరణ ట్రయల్ రన్‌ను నిర్వహించారు. కలెక్టర్ హరినారాయణన్ తన సిబ్బంది ద్వారా నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ వేసిన వ్యక్తికి సంబంధించిన ఓటర్ల జాబితా పరిశీలన, ప్రతిజ్ఞ, ఫీజు చెల్లింపు పత్రాలు ఇలా అన్ని వివరాలను పూర్తి చేయడం తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్వో బాపిరెడ్డి, ఎఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యో కష్టజీవులే.. కడతేరిపోయారు!

- చామదలలో ఎవరినోటవిన్నా ఇదేమాట
- గ్రామంలో విషాదఛాయలు

జలదంకి, ఏప్రిల్16: 'అయ్యో.. ఆ కుటుంబంలోని వారంతా కష్టజీవులే.. రెక్కాడితేకాని డొక్కాడని బతుకులు వారివి. ఊరొదిలి వెళ్లి నాలుగు రాళ్లు సంపాదించుకున్నారు. ఇంతలోనే ఎంత విషాదం. వారిని ఆ భగవంతుడు చిన్నచూపు చూశాడు. రామకార్యం కోసం వారు వస్తే విధి వారిని ఎంత కర్కశంగా బలిగొంది. అయ్యో.. దేవుడా.. పగవారికి కూడా ఈ దారుణం జరగకూడదు.. భగవంతుడా...ఏమిటీ ఘోరం' అంటూ చామదలలో మంగళవారం సాయంత్రం ఎవరినోట విన్నా ఈ మాటలే. గౌరవరం రోడ్డు ప్రమాద ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన మృతుడు దావులూరి శ్రీనివాసుల కుటుంబ సభ్యు లు చిన్ననాటి నుంచి బెంగుళూరు, హైదరాబాద్‌లలో బేల్దారి పనులకు వెళ్లేవారు. శ్రీనివాసులు తన అన్న శ్రీరాములుతో కలసి వెళ్లి పనిచేసేవాడు. ఈ క్రమంలో మూడేళ్ల నుంచి శ్రీరాములు చామదలలో ఇంటివద్దే ఉండేవాడు. శ్రీనివాసులు హైదరాబాద్ ఇబ్రహీంపట్నం ప్రాంతంలో బేల్దారి మేస్త్రీగా బిల్డింగ్‌లు కాంట్రాక్టుకు తీసుకుని పని చేయించేవాడు. ఈ క్రమంలో తన కుటుంబాన్ని కూడా హైదరాబాద్‌కు మార్చాడు. భార్యతోపాటు అల్లుడు గంటా సునీల్, కూతురు నీలిమలను కూడా తన వద్దే ఉంచుకుని పనులు చేయించేవాడు. రెండేళ్ళక్రితం కారు కొన్నాడు. ప్రతి ఏటా ఏకాదశికి, శ్రీరామనవమికి స్వగ్రామం వచ్చేవాడు. కుటుంబ సభ్యులతో పండుగ జరుపుకుని తిరిగి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం గ్రామానికి వారంతా చేరుకున్నారు. పండుగ సామాను కోసం కావలి వెళ్తుండగా ఈ ఘోర దుర్ఘటన జరిగింది. తల్లిదండ్రులు లేని అనాథలుగా శ్రీనివాసులు ఇద్దరు కూతుళ్లు మిగిలారు. వీరిలో ఓ కుమార్తెకు ఇంకా పెళ్లి కాలేదు. భార్య, కుమారుడి మృతితో అల్లుడు గంటా సునీల్ ఒంటరయ్యాడు. ఈ సంగతి తలుచుకుని మృతుడు శ్రీనివాసులు ఇద్దరు కూతుళ్ల, అల్లుడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


గంటా నీలిమ (ఫైల్)
దావులూరి లక్ష్మమ్మ (ఆశావర్కర్) (ఫైల్)
చిన్నారి గంటా కౌశిక్ నందన్ (ఫైల్)

స్వామి కార్యానికి వచ్చి..

- ఒకే కుటుంబంలో ఐదుగురిని బలిగొన్న రోడ్డు ప్రమాదం
- మృతులంతా చామదల వాసులు
- మృత్యుశకటంలా ఆగి ఉన్న లారీ


ప్రమాదంలో మృతి చెందిన దావులూరి శ్రీనివాసులు, వరలక్ష్మి దంపతులు (ఫైల్)

కావలి/కావలి రూరల్, ఏప్రిల్ 16: దేవుడు కార్యాన్ని నెరవేర్చేందుకు వచ్చిన ఆ కుటుంబం తిరిగిరాని లోకాలకు వెళ్లింది. కావలి రూరల్ మండలం గౌరవరం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలదంకి మండలం చామదలకి చెందిన ఓ కుటుంబంలోని ఐదుగురు మృత్యువాత పడ్డారు. పోలీసుల కథనం మేరకు, చామదలకు చెందిన దావులూరి శ్రీను హైదరాబాద్‌లో బిల్డర్‌గా స్థిరపడ్డాడు. గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కుటుంబ సభ్యులతో కలసి కారులో హైదరాబాద్ నుంచి మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకున్నాడు. ఉత్సవాలకు అవసరమైన సామగ్రిని తీసుకు వచ్చేందుకు అదే కారులో కావలికి బయలు దేరారు. కారులో దావులూరి శ్రీను(50), ఆయన భార్య వరమ్మ(45), కుమార్తె గంటా నీలిమ(24), మనవడు గంటా గౌసిక్ నంద్(3), వదిన దావులూరి లక్ష్మమ్మ(52)లు ఉన్నారు. వారు వస్తున్న కారు గౌరవరం వద్ద ఆగిఉన్న లారీని ఢీకొంది. దీంతో వారంతా అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే టోల్ ప్లాజా మేనేజర్ గణేష్, హైవే సిబ్బంది కావలి డీఎస్పీ ఎం. వెంకటరమణ, సీఐ కాటూరి శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ కిందకు దూసుకుపోయిన కారులో ఎంత మంది చిక్కుకుని ఉన్నారో ..? వారిలో ఎంత మంది చనిపోయారో తెలియలేదు. అందుబాటులో ఉన్న ఎక్స్‌కవేటరను తెప్పించి కారును బయటకు తీశారు. అందులో ఉన్న వారంతా విగతజీవు లుగా కనిపించారు. వారు ఎవరో... ఎక్కడ నుంచి వస్తున్నారో తెలుసుకునేందుకు మృతుల వద్ద ఉన్న సెల్‌ఫోన్లు ద్వారా వారి బంధువులకు సమాచారం అందజేశారు. దీంతో బంధువులంతా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ నుంచి కావలి ఏరియా వైద్యశాలకు వచ్చారు. ఇంటి నుంచి అప్పుడే వచ్చి, అంతలోనే వారు మృతి చెందడాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోయారు. కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతి చెందిన వారిలో దావులూరి లక్ష్మమ్మ ఆశావర్కర్‌గా పనిచేస్తుండగా, గంటా నీలిమ వలంటీర్‌గా పనిచేస్తున్నారు. కారులోని మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు డీఎస్పీ ఎం. వెంకటరమణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కావలి ఏరియా వైద్యశాల వద్ద విలపిస్తున్న మృతుల బంధువులు

కోదండరాముడి బ్రహ్మోత్సవాల ప్రారంభం

● వైభవంగా అంకురార్పణ



బుచ్చి కోదండరామాలయంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెంరూరల్,మార్చి.16 : పట్టణం లోని పెద్దూరులో కొలువై ఉన్న సీతా,లక్ష్మ ణ సమేత కోదండరామాలయం బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యా యి. ముందుగా ఆలయ పండితులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడు మ అంకురార్పణ కార్యక్ర మాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉభ యదాతలు, స్థానిక భక్తులు పాల్గొన్నారు. కాగా బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ధ్వజారోహణ నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారికి శేషవాహన సేవ నిర్వహిస్తారు.

● **ఆలయానికి విద్యుద్దీపాల శోభ**

ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ రాజగోపురం ప్రత్యేక విద్యుద్దీప కాంతులతో కళకళలాడుతోంది. కార్యక్రమాలను ఆలయ వ్యవ స్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

విభజన హామీల అమలుపై జనచైతన్య యాత్ర

● విమలక్క



జనచైతన్య యాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న విమలక్క తదితరులు

కావలి, ఏప్రిల్16: ఆంధ్రప్రదేశ్ పునర్వి భజన చట్టం-2021 ఆధారంగా సాక్షాత్తు పార్లమెంటులో ఇచ్చిన విభజన హామీలను ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు గుర్తు చేసి, వారిని చైతన్య పరిచేలా జనచైతన్య యాత్రను ప్రారంభించినట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క తెలిపారు. కావలిలోని జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం యాత్ర కరపత్రాలను సమాఖ్య నేతలతో కలిసి ఆమె విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్, జార్జిరెడ్డిల జయంతుల సంద ర్భంగా ఏప్రిల్14న నెల్లూరు జిల్లా తానంచర్ల గ్రామంలో జనచైతన్య యాత్రను ప్రారంభించా మన్నారు. ఈ యాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాలను తాకుతూ మే 5న కారల్‌మార్క్స్ జయంతి రోజున శ్రీకాకుళం జిల్లా బొడ్డుపాడులో ముగుస్తోందని చెప్పారు. కావలికి చెందిన జనశక్తి నేత రియాజ్ బూటకపు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన విషయాన్ని గుర్తు చేస్తూ వారి కుటుంబాన్ని పరామర్శించామని తెలిపారు. ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేదు, ప్రత్యేక హోదా లేదని, చివరకు ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కును కూడా ప్రైవేటీకరణ దిశగా ఈ ప్రభుత్వాలు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదని, పోలవరం నిర్వాసితులకు కన్నీళ్లే మిగిలాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అధ్వాన పరిస్థితిలో ఉందని,ఈ స్థితిలో రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమేరకు సహాయం అందుతుందో వివరిస్తూ ఈ యాత్ర కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాష, అరుణోదయ సాంస్కృతి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రిష్ణ, ప్రగతిశీల మహిళాసంఘం నాయకురాలు బీ. గంగ, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల్లో ఫ్యాన్లు, కుక్కర్ల పట్టివేత



తనిఖీల్లో పట్టుబడిన వస్తువులను పరిశీలిస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్

మనుబోలు, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్ రోడ్డు వద్ద సరిహద్దు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. అక్కడ మంగళవారం రాత్రి పోలీసులు వాహనాలను నిలిపి తనిఖీలు చేస్తుండగా, భారీగా స్టాండింగ్ ఫ్యాన్లు, రైస్‌కుక్కర్లు బయట పడ్డాయి. ప్రకాశం జిల్లా కొమ రోలు మండలం పుల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కూరాకు వెంకటఅశోక్‌కుమార్ చెన్నై నుంచి ఎలాంటి పత్రాలు లేకుండా ఏపీ39టిఎక్స్ 1380 వాహనంలో 190 స్టాండింగ్ ఫ్యాన్లు, 24 రైస్‌కుక్కర్లు తీసుకెళుతున్నట్లు ఎస్ఐ. అజయ్‌కుమార్ తెలిపారు. దీంతో ఆ వాహనాన్ని, అందులో ఉన్న సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

రూ.10.85లక్షల నగదు..

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు జరుపుతున్న తనిఖీల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు 10.85లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన నగదు, మద్యం, పేకాట స్థావరాలపై దాడుల వివరాలతో పోలీసు కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. దాని ప్రకారం.. నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో తగిన రశీదులు లేకుండా తరలిస్తున్న రూ.5 లక్షల నగదు, అల్లూరు పరిధిలో రూ.1,85,500 నగదు, మనుబోలు పరిధిలో రూ.లక్ష నగదు, బుచ్చి పరిధిలో రూ.3లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కావలి రూరల్ పరిధిలో పేకాట స్థావరంపై దాడులు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.3,600 నగదు సీజ్ చేశారు. జలదంకి పరిధిలో ఇద్దరు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.2,690 నగదు స్వాధీనం చేసుకున్నా రు. గుడ్లూరు పరిధిలో 123 మద్యం సీసాలు, దుత్తలూరు పరిధిలో 21 సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకోగా, సెబ్ పోలీసులు జిల్లా వ్యాప్తంగా 102 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

పెన్నానదిలో మృతదేహం

● **చేతులు, కాళ్లు కట్టేసి ఉండటంపై అనుమానం**

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 16 : పెన్నానదిలో మంగళవారం ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరు నగరంలోని మెక్లిన్స్ రోడ్డు ప్రాంతానికి చెందిన ప్రసాద్(45) మానసిక వికలాంగుడు. అతనికి వివాహమైనప్పటికీ సంతానం లేరు. భార్య ప్రసన్న కొన్నేళ్ల కిందటే అతనిని వదిలి వెళ్లిపోయింది. దీంతో ప్రసాద్ ఒంటరిగానే జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో రంగనాయకుల దేవస్థానం కల్యాణ మండపం వెనుకవైపు పెన్నానదిలో మంగళవారం ప్రసాద్ మృతదేహం కనిపించింది. సంతపేట స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. ప్రసాద్ చేతులు బనియన్‌తో కట్టి ఉన్నాయి. కాళ్లకు లుంగీ చుట్టి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	142
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	280
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6957
వెండి కిలో ధర	రూ. 85,900
వెండి ఒక గ్రాము	రూ. 87.90

చికిత్సపొందుతూ

యువకుడి మృతి

సంగం, ఏప్రిల్ 16: రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మండలంలోని కొరిమెర్లకు చెందిన యెహోనా (31) మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. వివరాల మేరకు.. రెండురోజుల కిందట ఈ యువకుడు పనిమీద సంగం వచ్చి తిరిగి వెళ్తూ కలిగిరి రహదారిలోని ఆశ్రమం మలుపు వద్ద ముందు వెళ్తున్న మోటారు బైక్‌ను వెనుక నుంచి వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రున్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.



గుంతలతో ప్రమాదకరంగా మారిన చెరువులు

చెరువులు, కుంటలు..మటాష్!

● రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ భూముల కనుమరుగు
● నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు
● జిల్లా సరిహద్దు దాటుతున్న గ్రావెల్
● పాలకుల అండతోనే తరలింపు
● నామమాత్రపు దాడులతో అధికారులు సరి

వరికుంటపాడు, ఏప్రిల్ 16 : కాదేది అక్రమార్జనకు అనర్హం అన్న చందంగా మారింది కొంతమంది గ్రావెల్ వ్యాపారుల అవినీతి దందా. నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ ప్రాంతాల్లోని భూముల్లో యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు సాగి స్తున్నా పట్టించుకొనే నాథులే కరువయ్యారు. ఈ గ్రావెల్‌ను ట్రాక్టర్లతో జిల్లా సరిహద్దులు దాటిస్తున్నా మనకెందుకులే అంటూ మౌనం వహిస్తున్న అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. అధికార పార్టీ నాయ కుల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు. దీంతో వ్యాపారులు తమదైన శైలిలో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. రోజురోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న లే అవుట్లు, బొగ్గు, ఇటుక బట్టీలు, ఇతర వాణిజ్య అవసరా లకు మట్టిని తరలించేందుకు అనుమతులు తీసుకోవడం సవాలక్ష నిబంధనలతో కూడు కున్న పని. ఈ నిబంధనలను తుంగలో తొక్కిన వ్యాపారులు ఎంచక్కా అక్రమ వ్యాపారానికి తెరలేపుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా యంత్రాలతో తవ్వకాలు సాగిస్తూ నాణ్యమైన గ్రావెల్‌ను ప్రతినిత్యం సరిహద్దులు దాటించి ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు.

మెట్ట ప్రాంతాల్లో అధికం:

ఉదయగిరి, కావలి, కందుకూరు నియోజక వర్గాల్లో విస్తారమైన చెరువులు, ప్రభుత్వ, అటవీ భూములు అధికంగా ఉన్నాయి. వీటిపై కన్నేసిన అక్రమార్కులు చెరువులతో పాటు కొండలను సైతం కొల్లగొడుతూ గుల్ల చేస్తున్నారు.

నిరంతరం తరలింపు:

రోజురోజుకు లే అవుట్లు, ఇతర వాణిజ్య అవసరాలకు డిమాండ్ పెరుగు తుండడంతో అదే అదునుగా భావించిన వ్యాపారులు ఎక్స్‌కవేటర్లు, లెక్కకు మించిన ట్రాక్టర్లతో గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల అనుచరులకు నగదు ముట్టజెప్పి సాగిస్తున్న దందాపై స్థానికుల నుంచి ఫిర్యాదు అందినా ఆ సమయంలో హడావిడీ చేసే అధికారులు ఆపై అటువైపు కన్నెత్తి చూడడమే లేదు. తిరిగి రోజుల వ్యవధిలోనే యథావిధిగా తవ్వకాలు కొనసాగుతున్నాయంటే అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో తేటతెల్లమవుతుంది. పలు గ్రామాల్లో ప్రజలే స్వచ్ఛందంగా అక్రమ వ్యాపారాలను అడ్డుకుంటున్నారు.

దాడులు నిల్:

ప్రతినిత్యం యదేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, సెబ్ శాఖల అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. రాజకీయ ఒత్తిడులకు తలొగ్గిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి మనకెందుకులే అంటూ ఒకరిపై మరొకరు కొంటె సాకులు చెప్పుకొంటూ తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతినిత్యం లెక్కకు మించిన ట్రాక్టర్లతో పోటీలు పడి గ్రావెల్‌ను తరలించి రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు.



ఎక్స్‌కవేటర్‌తో సాగిస్తున్న తవ్వకాలు

అనుమతులు అంతంతే:

వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వింజమూరు, కొండాపురం, కలిగిరి, జలదంకి మండలాల్లో ఇలాంటి అవినీతి దందా జోరుగానే సాగుతోంది. వరికుంటపాడు, రామాపురం, వేంపాడు, అశోక్‌నగర్, విరువూరు, పెద్దిరెడ్డిపల్లి, తోటలచెరుపల్లి, కనియంపాడు, జీ.కొత్తపలి, గొల్లపల్లి, మహమ్మదాపురం గ్రామాల్లో పేరుకే అన్న చందంగా గోరంత అనుమతులు పొంది కొండంత వ్యాపారం సాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా గ్రామాల్లో కొన్నిచోట్ల నామమాత్రపు అనుమతులు పొందిన ఉన్నాయి. అదే అదునుగా చూపించి ఇతర ప్రాంతాల్లోను యదేచ్ఛగా తవ్వకాలు సాగి స్తున్నా పట్టించుకొనే వారు లేరు. ఇదంతా ఒక వంతైతే ఎలాంటి అనుమతులు లేకపోయినా కొంత మంది వ్యాపారులు అధికార పార్టీ అండతో అడ్డంకులు లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. చెరువులు, వాగులు, వంకలు, ప్రభుత్వ భూములను నామరూపాలు లేకుండా పోతున్నాయి. పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా తీసిన గుంతలు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉన్నాయి. కేవలం ధన, రాజకీయ అండ ఉంటే చాలు అన్న ఆశతో కొంతమంది నిబంధనలకు విరుద్ధంగానే వ్యాపారాలు సాగిస్తూ ప్రతినిత్యం రూ. లక్షల్లో ప్రకృతి సంపదను దోచుకు తింటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి ప్రకృతి వనరులను దోచుకుంటూ అక్రమ వ్యాపారం సాగిస్తున్న వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర తదితరులు



బీసీలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం

● రాజ్యాంగబద్ధంగా 16,800 పదవులు కోల్పోయారు..
● కమిషనర్ రాణాకు ఐపీఎస్ రద్దు చేయాలి
● టీడీపీ నేత బీద రవిచంద్ర డిమాండ్

నెల్లూరు(వైద్యం) ఏప్రిల్ 16: రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల వారిని తీవ్రంగా మోసం చేసిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర విమర్శించారు. మంగళవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బీసీసెల్ ఎన్నికల కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కొత్తగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి,బీసీలకు పదవులు ఇచ్చామని సీఎం జగన్ చెబుతున్నారన్నారు. అయితే బీసీలకు రాజ్యాంగబద్ధంగా ఇవాల్సిన సర్పంచి, ఎంపీటీసీ, కౌన్సిలర్, కార్పొరేటర్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ ఛైర్మన్, మేయర్ తదితర 16,800 పదవులను ఆయన ఇవ్వలేదన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబులు బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించిందన్నారు. బలహీన వర్గాల కోసమే బటన్ నొక్కుతున్నానని చెబుతున్న సీఎం వారికి చేసిన మేలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బీసీలు ఈవీఎంల బటన్ నొక్కి వైసీపీని ఓడించాలన్నారు. టీడీపీ కార్పొరేటర్ గాంధీపై గతంలో హత్యాయత్నం జరిగి కన్ను పోడిస్తే, పొరపాటున తాళం తగిలిందని కమిషనర్ రాణా నిర్లక్ష్యంగా మాట్లాడారన్నారు. ఇప్పుడు సీఎంకు గులకరాయి తగిలితే ఇదే కమిషనర్ సిగ్గులేకుండా మరోలా మాట్లాడుతున్నారని బీద ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయన ఐపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్, పీఎల్‌రావు , పోలిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

తల్లుల ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

● గ్రామ స్థాయిలో పర్యటించాలి : డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



మాట్లాడుతున్న డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 16 : గర్భధారణ సమయంలో, ప్రసవానంతరం తల్లుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. మంగళవారం ఎంఎల్‌హెచ్‌పీ. సీహెచ్‌వోలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో శిక్ష ణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, తల్లుల ఆరోగ్య విషయంలో, అసంక్రమణ వ్యాధుల నియంత్రణలో జీవనశైలి ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ శిక్షణలో పాల్గొన్న వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో తల్లుల ఆరోగ్యంపై పరిశీలన చేసి వారి ఆరోగ్యం మెరుగుపడేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ నవీన్, డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ బాలచంద్రబాబు, డాక్టర్ శ్రీనివాసులు, డెమో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోపై ఆరోపణలు అవాస్తవం

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 16 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య దుర్భాషలాడారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్ ఆరోపించటంలో వాస్తవం లేదని వైద్య ఆరోగ్యశాఖ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా అధ్యక్ష, కోశాధికారి నాగరాజు, మహేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావలిలోని స్కానింగ్ కేంద్రంపై ఫిర్యాదు చేయటానికి వచ్చిన శంకర్ కిశోర్‌తో పాటు బాధితురాలి భర్త శ్రీనివాసులు సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చారన్నారు. అయితే డీఎంహెచ్‌వో చాంబర్‌లో అధికారుల సమావేశం జరుగుతోందని, గంట తర్వాత కలుస్తానని సిబ్బందితో డీఎంహెచ్‌వో చెప్పించారన్నారు. కానీ, సిబ్బందిపై కిశోర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాదనకు దిగారని తెలిపారు. సమావేశం అనంతరం బాధితుడు శ్రీనివాసులును డీఎంహెచ్‌వో కలిసి పరిస్థితి తెలుసుకున్నారని, ఎలాంటి దుర్భాషలాడ లేదని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు

వసతులు కల్పించాలి : జేసీ



సెక్టార్ అధికారులు, బీఎల్వోల సమావేశంలో పాల్గొన్న జేసీ సేతుమాధవన్

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 16: పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు వసతులు కల్పించా లని జేసీ సేతు మాధవన్ అధికారులకు సూచించారు. మే 13న జరగనున్న సాధారణ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన చర్యలపై జేసీ సేతు మాధవన్ మంగళవారం బుచ్చి ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశమందిరంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, నగర పంచాయతీ కమిషనర్ రమణబాబుతో కలిసి మండల సెక్టార్ అధికారులు, బీఎల్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పలు సూచనలిచ్చారు. ఈ సమావేశంలో 9మంది సెక్టార్ అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో

పెట్టుబడి భారం తగ్గుదల

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 16 : వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ కీలక పాత్ర పోషిస్తోందని, దీనివల్ల సమయం, ఖర్చులు తగ్గడంతో రైతుకు పెట్టుబడి భారం తగ్గుతుందని పలువురు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహించిన దక్షిణ మండల వ్యవసాయ పరిశోధనా, విస్తరణ సలహా మండలి సమావేశాలు మంగళవారం ముగిశాయి. డైరెక్టర్ డాక్టర్ ఎల్ ప్రశాంతి, విస్తరణ సంచాలకుడు డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెట్ట వ్యవసాయ పద్ధతులు, కలుపు యాజమాన్యం, వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతులపై అవగాహన కల్పించారు. మరో రెండేళ్లలో అందుబాటులోకి రానున్న వరి వంగడాలను వివరించారు. ఆక్వా రైతుల కోసం వివిధ రకాల చేపలు, రొయ్యలు, ముత్యపు చిప్పల పెంపకంలో మెలకువలు, నిమ్మ పంటలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం 2024-25 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేయబోయే శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులను సన్మానించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలి



నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 16: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వీ శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నెల్లూరు బాలాజీనగర్‌లోని చైతన్య ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో మహిళలకు గ్యాస్ సిలిండర్ల వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అగ్నిమాపక అధికారులు, సిబ్బంది డెమో నిర్వహించారు. గ్యాస్‌లీకై అగ్నిప్రమాదం జరిగితే తడిపిన గోనె సంచినిగానీ, తడిబట్టనుగానీ మండుతున్న సిలిండర్‌పై వేస్తే మంట ఆరిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమా ఎకశాఖ సహాయాధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఏకాంతసేవలో కామాక్షీదేవి సమేత సంగమేశ్వరుడు



ముగిసిన సంగమేశ్వరుడి

బ్రహ్మోత్సవాలు

● వైభవంగా ఏకాంత సేవ

సంగం, ఏప్రిల్ 16: పదకొండురోజులు పాటు జరిగిన సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు సోమవారం అర్ధరాత్రి స్వామివారి ఏకాంతసేవతో ముగిశాయి. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రోశ్చరణలు, భక్తుల గీతాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా రాత్రి కామాక్షి తాయి ఒక్కరే గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పుట్టింటి సాంప్రదాయానుసారంగా నైవేద్యంతో పాటు చీర, సారెలు పెట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న అమ్మవారికి పూజలు చేశారు. పలువురు భక్తిగీతాలు ఆలపిస్తుండగా ఊంజలసేవ చేపట్టారు. కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవాలల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం తరుపున చైర్మన్ రవీంద్రబాబు, ఈవో వెంకట వరప్రసాద్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నామమాత్రపు జరిమానా ?

● యంత్రాల విడుదలకు సన్నాహాలు



సోమశిల పోలీసుస్టేషన్ వద్ద ఉన్న ఎక్స్‌కవేటర్లు

అనంతసాగరం, ఏప్రిల్ 16: సోమశిల సమీపంలోని పడమటికంభంపాడు (పీకేపాడు) ఇసుక రీచ్‌లో నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు జరిపిన ఎక్స్‌కవేటర్లను నామమాత్రపు జరిమానాతో విడిపించేందుకు ప్రభుత్వ పెద్దల ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో పోలీసులు కూడా వాటిని విడుదల చేసే పనిలో ఉన్నారు. నిబంధనల మేరకు రీచ్‌లో ఎక్స్‌కవేటర్లు వినియోగించి ఇసుక తవ్వకాలు జరపరాదు. అయితే గతనెల 31న ఈరీచ్‌లో నాలుగు యంత్రాలతో తవ్వకాలు జరిపి లారీలకు ఇసుక నింపారు. స్థానికుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు వాటిని స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసిన అధికారులు వాటిని సోమశిల పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా నిబంధనలు పట్టించుకోకుండా ఒక్కో వాహనానికి రూ.50వేలు వంతున జరిమానా విధించి రిలీజ్ చేసేలా మైనింగ్ అధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఇదంతా అధికార పార్టీ నేతల జోక్యంతో జరుగుతున్నట్లు తెలిసింది.ఈ భారీయంత్రాలను నామమాత్రపు జరిమానాతో విడుదల చేసేయత్నాలపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

శ్రీరామనవమి ఘనంగా జరుపుకోవాలి



ముత్తుకూరు, ఏప్రిల్ 16: శ్రీరామనవమి సందర్భంగా పేపర్ కార్వింగ్‌తో శ్రీరాముని సూక్ష్మ చిత్రాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు ముత్తుకూరుకు చెందిన సూక్ష్మ చిత్రకారుడు సోమా పద్మారత్నం. శ్రీరామనవమి సందర్భంగా ప్రజలందరూ వడపప్పు, రామునికి ప్రీతిపాత్రమైన పానకం ప్రసాదాల స్వీకరణతో పండుగ జరుపుకోవాలన్నారు.

ఉదయగిరి రూపురేఖలు మారుస్తా!

- టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్
- కొండాపురం మండలంలో వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరికలు
- అల్లిక మధు ఆధ్వర్యంలో 200 మందికి టీడీపీ తీర్థం



గణేశ్వరపురంలో కాకర్లను పూలమాలతో సన్మానిస్తున్న నాయకులు, అభిమానులు



కొండాపురం: వైసీపీ కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కాకర్ల

వరికుంటపాడు, ఏప్రిల్ 16: మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకే తాను తొలి అడుగు వేస్తానని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. మంగళవారం గణేశ్వరపురంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో తాగు, సాగునీటి వసతి కల్పించడంతో పాటు అర్హులందరికీ పక్కాగృహాలు, భూములు అందేలా కృషి చేస్తానన్నారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారానే ప్రజలు దాహం తీర్చుకుంటున్నారని గుర్తుచేశారు. వైసీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎలాంటి అభివృద్ధి సాధించిన దాఖలాలు లేవని దుయ్య బట్టారు. అందుకు భిన్నంగా పార్టీ అధినేత నారా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రతి కుటుంబానికి అండగా ఉంటాయన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి ఉద్యోగ అవ కాశాలు కల్పించేలా తాను ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ల ఏర్పాటు యువతను ఉపాధి భరోసా కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతం లో ఒకే కుటుంబాన్ని ఏళ్ల తరబడి ఆదరించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప ప్రస్తుత ప్రభుత్వం కనీసం రహదారులు కూడా నిర్మించిన పాపాన పోలేద న్నా రు. అందరికీ అందుబాటులో ఉండే తాను కరెక్టో, లేక వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కరెక్టో ప్రజలు ఆలోచించి ఓట్లు వేయాలని అభ్యర్థిం చారు. మధ్యవర్తులతో సంబంధం లేకుండా సమ స్యలపై ప్రజలు నేరుగా తనను కలవాలని సూచించారు. కష్టమున్న ప్రతిచోటా తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ ప్రాంతం అభివృద్ధి ఎందుకు సాధ్యం కాదో తాను చూస్తానని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నారసింహపురం, తూర్పు రొంపిదొడ్ల, దక్కనూరు, తూర్పు కొండారెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, వేంపాడు గ్రామాల్లోనూ ప్రచారం నిర్వహించి ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న కాకర్ల

టీడీపీలో చేరిక: తూర్పురొంపిదొడ్లలో సర్పంచ్ కూండ్ల నాగేశ్వరి, మల్లంపాటి వెంగయ్యల ఆధ్వర్యంలో వైసీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కాకి అంకయ్యతో సహా పలురురి కుటుంబాలు టీడీ పీలో చేరారు. వారికి కాకర్ల పార్టీ కండు వాలతో వేసి ఆహ్వానించి అభినం దనలు తెలిపారు. కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండలాధ్యక్షుడు చంద్ర మధుసూదనరావు, జెడ్పీ టీసీ రావిళ్ల నాగేంద్ర, పేరం సుధాకర్‌రెడ్డి, కాకి ప్రసాద్, పావులూరి రవీంద్రబాబు, చంద్ర ఉమామ హేశ్వరరావు, ముజ్జె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొండాపురం: గరిమెనపెంట, వెంకటరంగాపురం, చల్లావారిపల్లి గ్రామాల నుండి స్థానిక టీడీపీ నాయకుడు అల్లిక మధు ఆధ్వర్యంలో మంగళవారం 200మందికిపైగా వైసీపీ కార్యకర్తలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం వెంకటరంగాపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాకర్ల మాట్లాడారు. వైసీపీ పాలన ఐదేళ్ల రాష్ట్రంలో పేదలకు, బడుగు, బలహీన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక మెట్ట ప్రాంతాల ప్రజలు బతుకుదెరువు కోసం వలస ప్రాంతాలకు తరలివెళ్లడం బాధాకరం అని వాపోయారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తేనే స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి వలసలను నివారిస్తామని కాకర్ల హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, రాష్ట్రకార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మామిళ్ళపల్లి ఒంకారం, ముస్లిం నాయకుడు షేక్ నాయబ్ రసూల్, టీడీపీ నాయకులు యారవ కృష్ణయ్య, లక్ష్మారెడ్డి, చెరుకూరు వెంకటాద్రి, దా మా మహేశ్వరరావు, బొట్లగుంట హరిబాబు, పోలినేని రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే టీడీపీకి ఓటేయండి !



గుంపర్లపాడులో మాట్లాడుతున్న ఆనం రామనారాయణ రెడ్డి

ఏఎస్ పేట, ఏప్రిల్ 16: మం డలంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే ప్రతి ఓటరు టీడీపీకి ఓటెయ్యాలని ఆత్మకూరు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయ ణరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన గుంపర్లపాడు, వేల్పులగుంట, అక్బారాబాదు, హసనపురం గ్రామాల్లో పర్యటించి ఓటర్లతో మా ట్లాడారు. తాను అధికారంలో ఉన్న 5ఏళ్లలో మండలంలో ఉత్తర కాలువ నిర్మాణం, ఐటీఐ కాలేజీ, ఆదర్శ పాఠశాల ఏర్పాటు ఇలా అభివృద్ధి పనులెన్నో చేశానని గుర్తు చేశారు. మరోమారు అవకాశం ఇస్తే అభివృద్ధి చేసుకునే అవకాశం వస్తుందన్నారు. 10ఏళ్లలో వైసీపీ పాలకులు ఏం చేశారో మీరే చూశారని.. తేడాను గమనించి ఓటు వేయాలని సూచిం చారు. వలంటీర్లు రాజీనామా చేయవద్దని టీడీపీ అధికారంలోకి వస్తే రూ.10వేలు జీతం ఇస్తా మన్నారు. సూపర్ సిక్స్ పథకాలు కావాలంటే ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని తెలిపారు. అక్రమ మద్యం తయారీదారుడు.క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులు ఒకవైపు, అభివృద్ధి చేసే మంచితనం ఉన్న వ్యక్తులు మరోవైపు ఉన్నారని ఈ విషయాన్ని గుర్తిం చుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు, నాయకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కాటంరెడ్డి నరసింహారెడ్డి, ఖాజామియ్య, మాల్యాద్రినా యుడు, షేక్ ఖదర్‌బాషా, అల్లంపాటి కృష్ణరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 16: నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జీ.చెర్లోపల్లిలో మంగళవారం జనసేన నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే సమాజసేవకులైన వేమిరెడ్డి, కాకర్లను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కల్లూరి సురేందర్‌రెడ్డి, అలూరి రవీం ద్ర, కుర్రా కృష్ణయాదవ్, పెట్లు కిరణ్‌కుమార్, అఖిల్, హరినాథ్, పవన్ పాల్గొన్నారు.

చేజర్ల: పులనీళ్ళపల్లి, చలపనాయుడుపల్లి గ్రామాల్లో స్థానిక టీడీపీ నాయకుడు శ్రీధర్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలుపు కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలను వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం ఏర్పడాలని పిలుపునిచ్చారు.



బసినేనిపల్లిలో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సీతారామపురం: తెలుగుదేశం మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, మండల కో ఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం బసినేనిపల్లిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ యువత, నాయకులు ఇంటింటికీ వెళ్లి పార్టీ సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేశా రు. పథకాల ఉపయోగాలను ప్రజల కు వివరించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం సీఎంగా చంద్రబాబు నాయుడుని గెలిపించుకోవాలన్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో మాజీ జెడ్పీటీసీ కలవెల జ్యోతి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బోగినేని కాశిరావు, జనసేన మండల కన్వీనర్ పాలిశెట్టి శ్రీనివాసులు, సురేష్, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, వెంకటేశ్వర్లు, ఇజ్రాయిల్, చెన్నకేశవులు, తూరక వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు కొడవటికంటి కిరణ్ పాల్గొన్నారు.

నామినేషన్ల ఘట్టానికి పటిష్ట బందోబస్తు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 16: ఈ నెల 18నుంచి జరగనున్న నామినేషన్ల పర్వానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 18 నుంచి 25వరకు జరిగే నామినేషన్ల ప్రక్రియకు ఇద్దరు డీఎస్పీలు, సీఐలు, ఆరు మంది ఎస్ఐలు, 50 మంది పోలీసు సిబ్బంది నియమించామన్నారు. నామినేషన్ కేంద్రానికి వందమీటర్ల దూరంలో బ్యారికేడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. ప్రధాన అభ్యర్థుల నామినేషన్ల రోజు వాహనాలను జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థుల ర్యాలీ వాహనాలను ఏబీఎం కాంపౌండ్ వద్దనే నిలుతామన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: వేసవిలో అగ్నిప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలు ముందస్తు చర్యలు చేపడితే నివారించవచ్చని అగ్నిమాపక దళ అధికారి టి.రమేష్‌బాబు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మం గళవారం మున్సిపాలిటీ పరిధిలోని టిడ్కో భవన సముదాయంలో అగ్నిమాపక ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలు, విద్యార్థులు, కార్మికుల్లో చైతన్యం తేవడం కోసం వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపకదళ సిబ్బంది కె.శ్రీనివాసరావు, ఏ.సుధాకర్‌రావు, షేక్ రబ్బానీబాష, టి.రమేష్ పాల్గొన్నారు.

మ్యాపింగ్ తప్పనిసరి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 16: మండలంలో చదువు పూర్తి చేసి పాఠశాలలు విడిచివెళ్లే విద్యార్థులకు తప్పనిసరిగా స్కూల్ మ్యాపింగ్ చేయాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన కుర్రపల్లి, నేలటూరు ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏ పాఠశాలల్లో చదివారో ఆ వివరాలను చైల్డ్‌ఇన్‌ఫో సైట్‌లో పొందుపరచాలన్నారు. ఈ నెల 23లోపు పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతికార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభాషిణి, షేక్ షఫీ అహ్మద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉదయగిరి, ఏప్రిల్ 16: తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రజియా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం సీడీపీవో వచ్చవ లావణ్యకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, ఫరుద్దీన్‌బాషా పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాజీనామాలు

కలువాయి, ఏప్రిల్ 16: అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఇదివరకే 46మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. తాజాగా మంగళవారం మరో 7గురు తమ రాజీనామాలను అధికారులకు అందజేశారు. దీంతో మండలంలో ఇప్పటివరకు 53మంది రాజీనామాలు చేసినట్లు అయ్యింది.

ఏపీ సీఆర్‌పీఎఫ్ మండలాధ్యక్షుడిగా రమణయ్య

సీతారామపురం, ఏప్రిల్ 16: పండ్రంగి గ్రామానికి చెందిన సింగాల రమణయ్యను ఏపీ సీఆర్‌పీఎఫ్ మండలాధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఈ విషయాన్ని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం అధ్యక్షుడు కుడారి తిరిపాలు నియమించినట్లు పేర్కొన్నారు.

ఉచిత ఒడుగుల కార్యక్రమం

ఉదయగిరి, ఏప్రిల్ 16: స్థానిక చిన్నమసీదు ఆవరణలో రహమతుల్ అలమీన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉచిత ఒడుగుల కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు 9490427421, 7013858306 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 16: బండగానిపల్లి పంచాయతీలోని బిజ్జంపల్లి బీసీ కాలనీకి చెందిన ఓబులాపురం వెంకటరత్నం అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి మృతదే హాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ట్రస్టు ద్వారా అంత్యక్రియలకు రూ.15 వేలు అందజేశారు.

ఎన్నికలపై బీఎల్‌వోలకు అవగాహన

సీతారామపురం, ఏప్రిల్ 16: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలకు ఎన్నికల విధానంపై ఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ అవగాహన కల్పించారు. మండలంలోని ప్రతిఒక్క బీఎల్‌వో వారి పరిధిలోని ఓటర్ల గడపగడపకు వెళ్లి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకునే విధానాన్ని తెలియజేయాలన్నారు. అంతేకాకుండా వారి కుటుంబంలో 50శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వికలాంగులు, మంచానికి పరిమితమైన వృద్ధులు ఉంటే ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే విధానాన్ని స్పష్టంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈఓ మస్తాన్‌వలి, తహసీల్దార్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం

ఉదయగిరి, ఏప్రిల్ 16: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వెనుకబడిన ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని నెల్లూరు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు అన్నారు. మంగళవారం ఆయన ఉదయగిరిలో ఎమ్మెల్యే అభ్యర్థి సోము అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలతో కలిసి బహిరంగసభ ఏర్పాటు చేశారు. పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే ఐదు గ్యారంటీలను వివరించారు. కార్యక్రమంలో సుందర్‌రెడ్డి, ఎంపీటీసీ విజయమ్మ, సత్తెనపల్లి బాలయ్య పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ల ఆవిష్కరణ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 16: త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్లను స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం సీఐ వేల్పుల గిరిబాబు ఆవిష్కరించారు. కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, ఎస్ఐ అనూష, కమిటీ సభ్యులు సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి, నరసింహులు, మధు, కొండలరావు, రమ్య పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కందుకూరు, ఏప్రిల్ 16: తెలుగుదేశం పార్టీ బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిలో చేరడంపై కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పాస్టర్లు ప్రార్థిస్తే టీడీపీ అండగా నిలుస్తుందని ఆపార్టీ కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఓ పంక్షన్‌హాలులో మంగళవారం నియోజకవర్గంలోని పాస్టర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలు విజయం సాధించాలని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవరెండ్ ఆలూరి కాలేబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గోనుగుంట వెంకటేశ్వర్లు (తిమోతి), పాస్టర్లు సీహెచ్ బాలసుందరం, శ్యామ్‌డానియేల్, ఆంతోనిబాబు, గడ్డం జాన్, పేముల జనార్దనరావు, ఇమ్మానియేల్, మహేష్, చిరంజీవి, అబ్రహం, సైమన్‌బాబు, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, రెబ్బవరపు మాల్యాద్రి, చదలవాడ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని జి.మేకపాడుకు చెందిన కాలే యలమంద, నాగభూషణం, శ్రీను, విజయ్, సుబ్బారావు, శంకర్, గూడపాటి బ్రహ్మయ్య సహా పలు వైసీపీ కుటుంబాల వారు మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయానికి వచ్చి పార్టీలో చేరారు. అలాగే లింగసముద్రం మండలం చీమలపెంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ముప్పాళ్ల శ్రీనివాసరావు, కరణం వంశీ తదితరులు పసుపు కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ పొత్తుపై అపోహలొద్దు

- పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో ఇంటూరి నాగేశ్వరరావు



పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఇంటూరి

ఉలవపాడు : తన సామాజిక వర్గంపైనే అట్రాసిటీ కేసులు పెట్టించిన ఘనుడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ అని కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో పలువురు సీనియర్ వైసీపీ నేతలు పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ లో చేరిన మాజీ వైస్ ఎంపీపీ గొత్తుల బ్రహ్మయ్య, మాజీ సర్పంచు దార్ల కోటేశ్వరరావు, ఎండోమెంట్ మాజీ ఈవో రామ్‌కుమార్, వాకా కృష్ణారెడ్డి, కోటు బాలయ్య, అక్కుల వెంకటరామిరెడ్డి, పీ.కొండపనాయుడు, కరేడు పంచాయతీ లోని మత్స్యకారులకు ఇంటూరి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో మంగళవారం రాత్రి ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. గ్రామానికి చెందిన వైసీపీ నేత రామిశెట్టి మాలకొండయ్య ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోటీ : పసుపులేటి



మాట్లాడుతున్న పసుపులేటి సుధాకర్

కావలిటౌన్, ఏప్రిల్ 16: రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రజల పక్షాన ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్నానని పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పీఎస్సార్ ట్రస్ట్ కార్యాలయంలో పట్టణం, రూరల్ మండలం నుంచి అనేక మంది యువత పీఎస్సార్ కండువాలు కప్పుకుని పసుపులేటికి మద్దతు తెలిపారు. పసుపులేటి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మీ వెంటే మేముంటామని మద్దతు తెలుపుతున్నారని, ప్రజల నుంచి ఊహించని విధంగా వస్తున్న స్పందన చూస్తుంటే భారీ మెజారిటీతో తప్పక గెలుస్తానన్నారు. తన ట్రస్ట్ ద్వారా చేసిన సేవలు ప్రజలు హృదయాల్లో పదిలపరుచుకున్నారని, నేటి స్పందన చూస్తుంటే చేసిన సేవ వృథాపోదన్న పెద్దల మాట నిజమని నిరూపితమౌతుందన్నారు. తాను సొంత నిధులతో కావలిని అభివృద్ధి చేస్తానన్న మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో రెండు ప్రధాన పార్టీల మధ్య ఇండిపెండెంట్‌గా పోటీ చేయనుండడం ప్రజల నుంచి అపురూప స్పందన లభిందన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు



నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బీద రవిచంద్ర, కావ్య, మాలేపాటి

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 16: దగదర్తి మండలంలోని పలు పంచాయతీలకు చెందిన పలువురు వైసీపీ నేత లు, కార్యకర్తలు మంగళవారం టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఉలవపాళ్ల పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీ య ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, టీడీపీ కావలి అభ్యర్థి దగుమాటి(కావ్య) వెంకటక్రిష్ణారెడ్డి, సీనియర్ నేత మాలేపాటి రవీంద్రనాయుడు పాల్గొన్నారు. చిన్నసంపం, వడ్డిపాలెం ప్రాతాలకు చెందిన 20 కుటుంబాల వైసీపీ నేతలు, కార్యకర్తలు సాల్మన్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి బీద, కావ్యలు కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతపురం, దామవరం, కేకేగుంట పంచాయతీలలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం బీద విలేకర్లతో మాట్లాడుతు టీడీపీ పాలనలో దగదర్తిలో ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేస్తే, వైసీపీ పాలనలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, అయన అనుచరులు ఆ భూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు గోతులు చేశారన్నారు.

పటిష్టమైన సంఘంగా 'హంస'

- డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రోహిత్



సత్కారం అందుకున్న హంస నూతన కార్యవర్గం

కావలిటౌన్, ఏప్రిల్ 16: వైద్య ఆరోగ్య శాఖలో హంస అసోసియేషన్ పటిష్టమైన సంఘంగా రూపుదిద్దుకుంటుందని డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కర్నాటి రోహిత్ పేర్కొన్నారు. మంగళవారం ఏరియా వైద్యశాల సమావేశం మందిరంలో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్‌ల పర్యవేక్షణలో కావలి తాలూకా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్లు రోహిత్, వెంకటలక్ష్మిలు నూతన కార్యవర్గాన్ని సత్కరించి అభినందించారు. వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో డిమాండ్ల సాధనలో హంస చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేసే వారిని ఎన్నుకున్నామని, హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ నేతృత్వంలో ఉద్యోగుల హక్కుల సాధనకు హంస ముందుంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగభార్గవి, హరిబాబు, ఇందిర తదితరులు పాల్గొన్నారు. తాలూకా యూనిట్ సంఘం అధ్యక్షుడిగా సోమేశ్వరరావు, కార్యదర్శిగా లక్ష్మీనరసయ్య, కోశాధికారిగా హరిప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ధనలక్ష్మి తదితరులు ఎన్నికయ్యారు.

టీడీపీ పాలనలోనే యువతకు ఉపాధి



ఇంటింటి ప్రచారంలో గిరిధర్, బినీత్‌రెడ్డి

అల్లూరు, ఏప్రిల్ 16 : తెలుగుదేశం పాలనలోనే యువతకు ఉపాధి కల్పన జరిగిందని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు పట్టణ పరిధిలోని అల్లిమడుగు కాలనీలో మంగళవారం రాత్రి కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డితో కలసి ఇం టింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేబాల శంకర్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, అనురాధ, పోలమ్మ, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మేడా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఎన్నార్‌పేటలో టీడీపీ ప్రచారం

బిట్రగుంట, ఏప్రిల్ 16: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, ఆయన సతీమణి పమిడి ఉమాప్రియ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్.సుధీర్‌బాబు, దొడ్ల అంజయ్య యాదవ్, అహ్మద్‌బాషా, ఐ.తిరుపతిరెడ్డి, ఏ.ప్రసాద్, పీ.హరిబాబు, టీ.సాయిప్రసాద్, జానకిరామయ్య, డీ.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వార్డు సభ్యుడి రాజీనామా

కొండాపురం, ఏప్రిల్ 16: మండలంలోని తూర్పుయర్రబల్లి పంచాయతీ మూడో వార్డు సభ్యుడు చింతం చిన్న తిరుపతి మంగళవారం తనపదవికి రాజీనామా చేసి ఆ పత్రాన్ని ఎంపీడీవో సుజాతకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ తరపున విజయమ సాధించినప్పటికీ పంచాయతీ సమావేశాలకు తనను ఏనాడు పిలవకపోవడం, తీర్మానాలలో తన ఆమోదం పరిగణనలోకి తీసుకోకపోవడం తనకు బాధ కలిగించిందన్నారు. తన వార్డు పరిధిలోని ప్రజలకు ఎటువంటి పనులు చేయలేదని, ఆలాంటప్పుడు ఈ పదవి తనకు అవసరంలేదని రాజీనామా చేస్తూ ఆమోదించాలని ఎంపీడీవోను కోరానన్నారు. ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధి



ఇంటింటి ప్రచారంలో టీడీపీ నేతలు

లింగసముద్రం, ఏప్రిల్ 16 : రాబోయే ఎన్నికల్లో తెలగుదేశం పార్టీని గెలిపిస్తే చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్‌లు పేర్కొన్నారు. మంగళవారం లింగసముద్రం పంచాయతీలోని బలిజపాలెంలో టీడీపీ, జనసేన నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నెల్లూరు ఎంపీ, కందుకూరు ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు బింకం శేషయ్య, మైలరామకేశవులు, కొట్టే వెంకట నారాయణ, కండే మాలకొండయ్య, పి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

అల్లూరు, ఏప్రిల్ 16 : రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి ఒక్క అవకాశం ఇవ్వాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ రిస్ట్ కావలి నియోజకవర్గ అభ్యర్థి ఎల్లు సాల్మన్‌రాజు కోరారు. మండలంలోని నార్తుఆములూరులో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కోవూరు బాబు, నక్కా గిరి, వెంకటరమణయ్య, కోవూరు చిన్నారావు, దాసరి దేవ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఆలయాల ముస్తాబు

బిట్రగుంట, ఏప్రిల్ 16: బోగోలు మండలంలోని పలు ఆలయాలు శ్రీరామ నవమి వేడుకలకు విద్యుత్ దీప అలంకరణలతో ముస్తాబయ్యాయి. బుధవారం నుంచి శ్రీరామ నవమి వేడుకలు జరుగనుండటం వలన ఆలయాల వద్ద చలువ పందిలు వెశారు. అయోధ్య రామ మందిర కమిటీ పిలుపు మేరకు మండలంలోని ఐదు ఆంజనేయస్వామి, రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభమవుతాయని సమరసతా సేవా ఫౌండేషన్ కావలి డివిజన్ అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీరామ భక్తులు తరలిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసులు యాదవ్ కోరారు.

రోడ్డు ప్రమాద మృతులకు సంతాపం

జలదంకి, ఏప్రిల్ 16: బోగోలు మండలం ముంగమూరు తోటల సమీపంలో జాతీయరహదారిపై మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చామదలకు చెందిన మృతులకు టీడీపీ నాయకులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రబాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, కావలి, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యేలు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, దేవరపల్లి క్రిష్ణారెడ్డి, మునగాల వెంకటేశ్వర్లురెడ్డి ఉన్నారు. మృతుల కుటుంబాలకు తమ సానుభూతిని వ్యక్తం చేశారు.

శిరోముండనం కేసులో శిక్ష తగ్గించడం అన్యాయం

బిట్రగుంట, ఏప్రిల్ 16: దళితుల శిరోముండనం కేసులో నిందితులకు శిక్ష తగ్గించడం అన్యాయమని దళిత సంఘ రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. బోగోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఆయన నిరసనతెలిపారు. 1996లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో ఇసుక మాఫియాకు దళితులు అడ్డు వస్తున్నారని కట్టేసి పోలీస్‌స్టేషన్లో గుండు గీసి ఊరేగించారన్నారు. ఈ కేసులో అప్పటి రామచంద్రపురం ఎమ్మెల్యే తోట త్రిమూర్తులకు 18నెలల శిక్ష వేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సాదుప్రసాద్, ఆత్మకూరి తేజ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

కందుకూరు, ఏప్రిల్ 16: కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గెలుపుకోసం ఆయన సతీమణి ఇంటూరి సౌజన్య మంగళవారం పట్టణంలోని 18, 19 వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా 19వ వార్డుకు చెందిన పలు ముస్లిం కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, నగర జయకృష్ణ, పొన్నం కృష్ణమోహన్, ముచ్చు శ్రీనివాసులు, షేక్ మున్నా, చిడిపోతు కోటేశ్వరరావు, వడ్డివల్లి మాధవరావు, సోమినేని మల్లికార్జున, దివి వెంకటేశ్వర్లు, సయ్యద్ సుల్తాన్, మసూద్, ముస్తఫా, యజ్ఞాని పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా : ప్రశాంతిరెడ్డి


బుచ్చిరెడ్డిపాళెం : టీడీపీలో చేరిన వారితో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఏప్రిల్ 16: అభివృద్ధి అంటే ఏమిటో తాను చేసి చూపి స్తానని, వైసీపీని వీడి టీడీపీలో చేరిన, ఎప్పటి నుంచో పార్టీలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలందరికీ గౌరవం కల్పిస్తామని ఎన్డీఏ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పడుగుపాడులో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం చేప ట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కుటుంబం ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చిం దన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును, పార్ల మెంటు స్థానానికి పోటీ చేస్తున్న తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆమె కోరారు. కార్యక్రమంలో పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, విన్నకోట రాధాకృష్ణ, రఫీ, షఫీ, గుండుమల్లి శ్రీనివాసులు, అల్లాభక్షు, సర్దార్, అల్లిమా, జార్జి నాయకత్వంలో సుమారు 100మంది టీడీపీలో చేరారు.

పంచాయల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తా..

బుచ్చిరెడ్డిపాళెం : ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గంలోని 84 పంచాయతీలలో తాగునీటి సమస్య పరిష్కరిస్తానని మాటిచ్చారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం బుచ్చి పెద్దూరులోని దళితవాడల నుంచి 2వ వార్డు ఇన్‌చార్జ్ జూగుంట పురుషోత్తం, మాజీ సర్పంచు స్నేహలత, కౌన్సిలర్ కల్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీడీపీ ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత వాడలోని ప్రేమ్‌చంద్‌తోపాటు 150 కుటుంబాలు, బుచ్చి హౌస్‌తోట నుంచి మరో 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవీ శేషయ్య, ప్రభాకర్‌రెడ్డి, కొండయ్య, వుసురుపాటి, హరనాద్, శ్రీనివాసులురెడ్డి, జి శ్రీనివాసులు, టీడీపీ, బీజేపీ. జనసేన నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

ఇందుకూరుపేట: సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పల్లెపాడు గ్రామంలో మంగళవారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే అమలుచేసే పథకాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గాంధీజీ నడయాడిన పల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్య క్రమంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, గుడి హరికుమార్‌రెడ్డి, అవ్వారు ఏడుకొండలు, మునగాల రంగారావు, చింతపంటి వెంకటరమణయ్య, నెల్లూరు రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలను మోసం చేసిన వైసీపీ


యల్లయపాళెం ఎన్నికల ప్రచారంలో అర్జున్ రెడ్డి

కొడవలూరు, ఏప్రిల్ 16 : వైసీపీ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలను తీవ్రంగా మోసం చేసిందని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తనయుడు అర్జున్‌రెడ్డి అన్నారు. మండలంలో యల్లయపాళెంలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి టీడీపీ గెలిస్తే చేపట్టే పథకాలను వివరించారు. నియోజకవర్గం అభివృద్ధి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమన్నారు. ఎన్నికల్లో వేమి రెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు గరికపాటి రాజేంద్ర కుమార్, కేతూ వెంకటరమణారెడ్డి , బడుగు శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి టీడీపీతోనే

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోడలు ఐషితారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గౌతమినగర్, తలమంచి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని ఇంటింటికీ తిరిగి వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. అనంతరం తలమంచి గ్రామంలో కార్యకర్త పిట్టి సూరినారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంత ప్రజలు మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, కల్లూరి సందీప్, తిరకాల ప్రసాద్, నారయణ తదితరులు పాల్గొన్నారు.

నార్తు రాజుపాళెంలో టీడీపీ ప్రచారం

మండలంలో నార్తు రాజుపాళెంలో టీడీపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇరువూరి శ్రీధర్‌రెడ్డి, మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కరకటి మల్లికార్జున, తువ్వర ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన


సెబ్ స్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్ఈవో

బుచ్చిరెడ్డిఏళెం, ఏప్రిల్16: బుచ్చిరెడ్డిపాళెంలోని సెబ్ స్టేషన్‌ను మంగళవారం నెల్లూరు డీఎస్ఈఓ వి దయాసాగర్ సందర్శించారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మద్యం అక్రమ నిల్వలపై సమాచారం ఇచ్చే వారి వివరాల విషయంలో గోప్యం పాటిస్తారని సెబ్ సీఐ తెలిపారు.

మత్స్యకారుల ఆందోళన


మత్స్యకారులతో మాట్లాడుతున్న జెన్‌కో అధికారులు

ముత్తుకూరు, ఏప్రిల్ 16: సమస్యల పరిష్కారం కోసం కృష్ణపట్నం సముద్ర తీరంలోని జెన్‌కో కోల్ కన్వేయర్ బెల్టు వద్ద మత్స్యకారులు మంగళవారం ఆందోళనకు దిగారు. బెల్ట్ కారణంగా వస్తున్న బొగ్గు దుమ్ముతో తాము ఇబ్బందులు పడుతున్నామని, ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని నిరసిస్తూ కన్వేయర్ బెల్ట్ పనిచేయకుండా ఆర్కాట్‌పాలెం, రామ్‌నగర్ మత్స్యకారులు ఆపివేశారు. దీంతో జెన్‌కో థర్మల్ కేంద్రానికి బొగ్గు రవాణా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న జెన్‌కో అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించమని మత్స్యకారులు స్పష్టంచేశారు. దీంతో జెన్‌కో అధికారులు త్వరలో సమస్య పరిష్కరించి కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ముస్లిం మైనార్టీలను మోసంచేసిన జగన్ : సోమిరెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి

వెంకటాచలం, ఏప్రిల్ 16: వైసీపీ ప్రభుత్వం ముస్లింలను సంక్షేమ పథకాలకు దూరంచేసి తీరని ద్రోహం చేసిందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని కసుమూరులో మంగళ వారం జరిగిన ముస్లిం మైనా ర్టీల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చంద్ర బాబు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, దుకాణ్-మకాన్, విదేశీవిద్య, వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టారని, వాటన్నింటినీ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. సర్వేపల్లిలో కాకాణి చేసిన అరాచకాలతో ముస్లింలు అణిచివేతకు గురయ్యారని, ఎన్నికల్లో కాకాణికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీసీలపై కాకాణి వేధింపులు

తోటపల్లిగూడూరు: మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బీసీలను వేధింపులకు గురి చేస్తున్నాడని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని వరిగొండలో మంగళవారం జరిగిన బీసీ గర్జన సభలో సోమిరెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో బీసీలపై దాడులు పెరిగాయని, మంత్రి కాకాణి అరాచకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఏపూరి కృష్ణ ఆధ్వర్యంలో వైసీపీని వీడి 50 కుటుంబాలు టీడీపీలో చేరగా సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మి సురేంద్ర, నన్నారెడ్డి సురేష్‌రెడ్డి, కుడుముల నాగేశ్వరరావు, ఏపూరి కృష్ణ, కర్పూరం శ్రీనివాసులురెడ్డి, పంది రామసుబ్బాయ్య, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నుంచే కాకాణి రాజకీయ పతనం ప్రారంభం

పొదలకూరు: పొదలకూరు మండలం నుంచే మంత్రి కాకాణి పతనం ప్రారంభమైందని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో బిరదవోలు పంచాయతీకి చెందిన 8 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని కండువా కప్పి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో అచ్చి పెంచలరత్నం, గుంజి దయాకర్, వెంకటేశ్వర్లు, వాకాటి పెంచలకుమార్, గుంజి శ్రీహరి, అచ్చి వెంకటేశ్వర్లు, మద్దూరు గురుప్రసాద్, రాజేష్‌లు ఉన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే టీడీపీ లక్ష్యం

మహిళల ఆర్థిక స్వావలంబన టీడీపీ లక్ష్యం అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సతీమణి జ్యోతి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద పొదలకూరు మండల తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన మహాశక్తి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ప్రతి మహిళా పరాశక్తిగా మారి ఓటు అనే ఆయుధంతో వైసీపీ రాక్షస పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా మండల అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు మహిళా ఉపాధ్యక్షురాలు వెంపులూరు అరుణమ్మ, మాజీ ఎంపీటీసీ కొంగి వెంకటరమణ, పార్లపల్లి సర్పంచ్ గూడూరు ప్రసన్న, బిందురెడ్డి, సాయి సుధీషా, టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే దళితుల అభ్యున్నతి

దళితుల అభ్యున్నతికి పాటుపడింది ఒక్క తెలుగుదేశం పార్టీనేనని పార్టీ సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పొదలకూరు మండల టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ సదస్సుకు ముఖ్య అతిథులుగా సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య పాల్గొన్నారు. ఎస్సీలను కేవలం రాజకీయంగా ఉపయోగించుకునేందుకే వైసీపీ ప్రయత్నిస్తోందని, రాబోవు ఎన్నికల్లో వైసీపీకి తమ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. ముందుగా దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి, ఇటీవల మృతిచెందిన ఎస్సీ సెల్ టీడీపీ నాయకులు గంథం రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, సర్వేపల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు విజయరాజు, సర్వేపల్లి ఇన్‌చార్జ్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఉదయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

ఎన్టీఆర్ హయాంలోనే మహిళలకు గౌరవం

తోటపల్లిగూడూరు: దివంగత నందమూరి తారకరామారావు హయాంలోనే మహిళలకు ఆత్మగౌరవం లభించిందని సోమిరెడ్డి కోడలు శృతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రిషి కల్యాణ మండపంలో మంగళవారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలందరూ కలిసికట్టుగా సోమిరెడ్డి విజయానికి కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకురాలు సుస్మిత, మాజీ ఎంపీపీ ఇంగిలాల నిర్మలమ్మ, వీలుకానిపల్లి, ముంగలదొరువు సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్ : కొణతం

తోటపల్లిగూడూరు: దళితుల ద్రోహి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు పేర్కొన్నారు. మండలంలోని నరుకూరు రిషి కల్యాణ మండపంలో మంగళవారం దళితుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని దళితులను కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఊటుకూరు శ్రీనివాసులు, చింత సీతారామయ్య అవినాష్, ఇంగిలాల చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సేవా పక్షోత్సవాల ప్రారంభం

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 16: ఆపత్కాలములో ప్రజలకు ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ చేయూతనందిస్తోందని ఎస్ఈఐఎల్ కంపెనీ ప్రతినిధి సునీల్‌కుమార్ గుప్తా తెలిపారు. మంగళవారం ఎస్ఈఐఎల్‌లో జాతీయ అగ్ని మాపక సేవా పక్షోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. అత్యవసర వైద్యం, అగ్నిప్రమాదాలలో ప్రజలకు రక్షణ కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఓఅండ్ఎం విభాగాధిపతి సునీల్‌కుమార్‌గుప్తా, వివిధ శాఖల అధిపతులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

27 ఏళ్ల తర్వాత న్యాయం గెలిచింది

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 16: న్యాయస్థానంలో సుదీర్ఘం గా సాగిన విచారణలో నిందితులైన నాటి ఎమ్మెల్యే, ప్రస్తు త మండపేట వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుసహా తొమ్మిది మందికి జైలు శిక్ష, జరిమానా విధించడాన్ని స్వాగ తిస్తున్నామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రకుల అహంకారం, పెత్తందారి మనస్తత్వం నరనరానా నింపుకున్న త్రిమూర్తులు 1996లో ఎస్సీలైన యువకులను చిత్రహింసలకు గురిచేసి అవమానించారన్నారు. ఆ కేసులో న్యాయస్థానం తీర్పు వెలువరించిందన్నారు. 27 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత న్యాయం గెలిచిందన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

శ్రీరామ జయరామ!

- నేడు రామ నవమి
- నగరమంతా కల్యాణోత్సవాలు


విద్యుద్దీపాలంకరణలో శబరి శ్రీరామ క్షేత్రం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 16 : ఆదర్శ పురుషుడు శ్రీరామచంద్రుడి పుట్టిన రోజైన నవమి వేడుకలకు నెల్లూరు నగరం ముస్తాబైంది. బుధవారం శ్రీరామ నవమి పండుగ సందర్భంగా నగరమంతా సీతారామ కల్యాణోత్స వాలు వైభవంగా జరగనున్నాయి.

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బుధవారం నుంచే పంగున్యోత్తర ఉత్సవాలు ప్రారంభి స్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు ఉదయం 7.45గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామికి, సీతా లక్ష్మణ హనుమంత్సమేత శ్రీరామచంద్ర స్వామికి తిరుమంజన సేవలు జరుగుతాయని తెలిపారు. 10.30గంటలకు రామావతార ఘట్టంపై పురాణ ప్రవచనం, 11గంటలకు సీతారామ కల్యాణం, సాయంత్రం 5 గంటలకు పురాణ ప్రవచనం, 5.30 గంటలకు ప్రాకారోత్సవం, ఊంజల్ సేవ, 7గంటలకు రంగనాథ స్వామికి హనుమంత సేవ జరుగుతాయని, భక్తులు తరలిరావాలని కోరారు.

● పప్పులవీధి, ఉస్మాన్‌సాహెబ్‌పేట, భక్తవత్సలనగర్, చిన్నబజారు, పెద్దబజారు, మహా త్మాగాంధీనగర్, ఎన్టీఆర్ నగర్, కొత్తూరు, పొదలకూరురోడ్డు తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో జనకి రమణుల కల్యాణోత్సవం, అన్నదా నానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

● నగరంలోని షిరిడీ సాయి మందిరాల్లో బాబా జన్మ దినం, శ్రీరామనవమి వేడుకలు జరగనున్నాయి. గాంధీ బొమ్మ కూడలి సమీపంలోని బాబా మందిరంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్రనామార్చన, పూలంగిసేవ జరుగుతాయని మందిరం చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి తెలిపారు. చిల్డ్రన్స్‌పార్కు సాయి సదన్, బాలాజీ నగర్ సాయిదర్బార్‌లోనూ నవమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఆంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ప్రారంభం

నగరంలోని సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంకురార్పణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలు ఈనెల 27వతేదీ వరకు జరుగుతాయని ఈవో దుర్గయ్య తెలిపారు. ఆలయం చైర్మన్ చందోలు సతీష్‌కుమార్ తెలిపారు.

యువత భవితకు చంద్రబాబు గ్యారెంటీ

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ


ఓటు అభ్యర్థిస్తున్న నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 16 : జగన్ పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఉద్యోగాలు రావని, యువత భవిష్యత్‌కు చంద్రబాబు నాయుడే గ్యారెంటీ అని మాజీ మంత్రి, నెల్లూరు నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 9వ డివిజన్‌లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంతో మంది యువత ఉన్నత విద్యను పూర్తి చేసుకుని ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతుండటం బాధాకరమన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా తమ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించాలన్న వినతులు అధికమవుతున్నాయన్నారు. వీటన్నింటినీ అధిగమించాలన్నా, రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా తెలుగుదేశం పార్టీతో, చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 52వ డివిజన్‌లో నారాయణ సతీమణి రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 45వ డివిజన్‌లో నారాయణ కుమార్తె సింధూర ప్రచారంలో పాల్గొన్నారు. 11వ డివిజన్‌లో మరో కుమార్తె శరణి ప్రచారం చేశారు.

● తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని 10, 11 డివిజన్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక శివాలయంలో అభ్యర్థి పొంగూరు నారాయణ ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో కల్తీ మద్యంతో 3 వేల మంది మృతి

- లక్షలమందికి అనారోగ్యం
- టీడీపీ అభ్యర్థులు వీపీఆర్, కోటంరెడ్డి


ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థులు వీపీఆర్, కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 16 : రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పట్నుంచి కల్తీ మద్యం తాగి 3 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, కొన్ని లక్షల మంది లివర్, కిడ్నీలు పాడై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రూరల్ పరిధిలోని 19వ డివిజన్‌లో రోడ్‌షో నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగన్ సర్కారు ఆదాయమే ధ్యేయంగా ప్రజల ప్రాణాలను పణంగా పెట్టిందని దుయ్యపట్టారు. మే 13న పోలింగ్ తరువాత వైసీపీ అభ్యర్థులైన విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి కంటికికూడా కనపడరన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విజనరీగా గుర్తింపు తెచ్చుకున్న చంద్రబాబు నాయుడు సీఎం అయితేనే ఏపీ బాగుపడుతుందని చెప్పారు. కాగా, కోటంరెడ్డి సతీమణి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి 2వ విడత ప్రచారంలో భాగంగా ఎన్జీఐ, పోస్టల్, జడ్పీ కాలనీల్లో పర్యటించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, దొడ్డపనేని రాజానాయుడు, నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, నగరంలోని 43వ డివిజన్ జెండా వీధిలో వైసీపీ నాయకుడు ఖాజీ సందానీ బాషా, అతని మిత్ర బృందం పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, షేక్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితర నాయకుల సమక్షంలో టీడీపీలో చేరారు.

ఎన్నికల విధుల్లో జాగ్రత్త : సిటీ ఆర్వో


ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో వికాస్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 16 : ఎన్నికల విధుల్లో పారదర్శకత చూపాలని, అధికారులంతా జాగ్రత్తగా వ్యవహరించాలని నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్వో) వికాస్ మర్మత్ సూచించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సమీక్ష జరిపారు. గురువారం నుంచి నామినేషన్ల ఘట్టం మొదలవుతున్నందున యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. చిన్న తప్పులు కూడా జరగడానికి వీలులేదని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ట్రయల్ రన్ నిర్వహించిన ఆయన నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, తిరస్కరణలపై అవగాహన కల్పించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేసే అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం 85 శాతం ఓట్లు పడేవిధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మూడు, అంతకన్నా ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

రేపటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చైర్మన్, ఈవో, అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 16 : సంతాన గోపాలుడిగా భక్తుల పూజలు అందుకుం టున్న మూలాపేట వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 28 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళి రెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయంలో సహాయ కమిష నర్ వీ గిరికృష్ణ, అర్చకులు శ్రీనివాస అయ్యంగార్, రంగరాజన్‌తో కలిసి బ్రహ్మోత్సవ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సంవత్సరం ఉత్సవాలు వైభ వంగా నిర్వహిస్తామని తెలిపారు. గిరికృష్ణ మాట్లాడుతూ ఉత్సవాల్లో ప్రతిరోజు ఉదయం పేట ఉత్సవం, రాత్రి నగరోత్సవం జరుగుతాయని తెలిపారు. గురువారం రాత్రి అంకురార్పణ, 19వ తేదీ ధ్వజారోహణ, 22వ తేదీ హనుమంతసేవ, 23న గరుడసేవ, 24న కల్యాణం, 25న రథోత్స వం జరుగుతాయన్నారు. సంతానం లేని దంపతులు ధ్వజారోహణ పూజలో ఉంచిన కొడి ముద్దలు స్వీకరించి సంతానం పొందాలని కోరారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం పూజలు, హోమాలు, విశేష అలంకారాలు జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని ఆహ్వానించారు.

ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ


వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 16 : ప్రభుత్వ నిబం ధనలు ఉల్లం ఘించి సెలవు ల్లో తరగతులు నిర్వహిస్తున్న జిల్లాలోని ప్రైవేట్, కార్పొ రేట్ ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకో వాలని ఎస్ ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో మంగళవారం కార్యాలయ ఏవో గోపాల్‌కు వినతిపత్రం అందచేశారు. విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వీ నరేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినప్పటికీ అనేక ప్రైవేట్, కార్పొ రేట్ కళాశాలలు ఇష్టానుసారంగా తరగతులు నిర్వహిస్తు న్నాయన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలు విడుదల కాకుండానే వారి తల్లిదండ్రులకు నిత్యం ఫోన్లు చేసి వేధిస్తూ ముందస్తు అడ్మిషన్లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమన్నారు. వీటిపై ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలని, ఆయా కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు డీ చరణ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రామరావణ యుద్ధం వంటిది లేదు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 16 : రామరావణ యుద్ధానికి సాటియైన మరొక యుద్ధం లేదని శతావధాని కొండేపి మురళీకృష్ణ తెలిపారు. రేబాలవారివీధిలోని పీటీజీ రాజ్ టవర్స్‌లో శ్రీరామ కథా తరంగిణి ప్రవచనాల్లో 6వ రోజు మంగళవారం ఆయన యుద్ధకాండంపై ప్రవచించారు. యుద్ధ ఘట్టాలతోపాటు శ్రీరామ పట్టాభిషేకం విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్ర మంలో పద్యసారస్వత పరిషత్ కార్యవర్గం, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ చైర్మన్ బల రామయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 16 : మహనీయుల జీవితాన్ని ఆదర్శం తీసుకుని యువత వారు చూసిన మార్గంలో నడవాలని విశ్రాంత తెలుగు పండితుడు ఆలూరి శిరోమణిశర్మ సూచించారు. మంగళవారం వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో నేలనూతల కృష్ణమూర్తి 19వ స్మారకోపన్యాసం చేశారు. నేలనూతల తెలుగు, ఆంగ్ల భాషల ఉన్నతికి, చరిత్ర పరిశోధనకు ఎంతో కృషి చేశారన్నారు. ఈ సదస్సుకు వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కాళిదాసు పురుషోత్తం, డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యం, దుర్భా మురళీకృష్ణ, సీవీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ కరపత్రాలు పంచుతున్న కోటంరెడ్డి

అవినీతి అనకొండ విజయసాయిరెడ్డి

● నారాయణ, వేమిరెడ్డిదే విజయం : కోటంరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 16 : వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయి రెడ్డి అవినీతి అనకొండ అని, జిల్లా ఓటర్లు ఆయనను ఎట్టి పరిస్థితుల్లో నమ్మరని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 14వ డివిజన్‌లో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ గతంలో నెల్లూరు నగరంలో చేసిన అభివృద్ధి ప్రజల మనసుల్లో బలంగా ఉందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ చేష్టలతో ప్రజలు విసిగిపోయారని, ఎమ్మెల్యేగా నారాయణ, ఎంపీగా వేమిరెడ్డిని భారీ మెజా ర్టీతో గెలిపించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, సుధాకర్ నాయుడు, సుభాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ సాధకులు

చిల్లకూరు ఇంజనీరుకు 558వ ర్యాంకు


సాయితేజ

చిల్లకూరు, ఏప్రిల్ 16 : చిల్లకూరు ఇంజనీరు సివిల్స్‌లో 558వ ర్యాంకు సాధించారు. చిల్లకూరు టీచర్స్ కాలనీలో నివాసముంటున్న నెల్లూరు శ్రీనివాసులు చిల్లకూరు మండలంలోని గుమళ్ల దిబ్బ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.ఆయన భార్య సరస్వతి ఓజిలి మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్‌సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. వీరి కుమారుడు సాయి తేజ తాజాగా విడుదలైన సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాల్లో 558వ ర్యాంకు సాధించారు. హైదరాబాదులోని బీహెచ్ఈఎల్ కంపెనీలో సాయితేజ 8 ఏళ్ల నుంచి సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా ఆయన భార్య జ్యోతి హైదరాబాదులోని పీడబ్ల్యూసీ సంస్థలో డేటా సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు.


తల్లిదండ్రులు, భార్యతో సాయితేజ

ఐఎఫ్ఎస్ నా లక్ష్యం

ప్రభుత్వ ఉద్యోగులైన మా అమ్మానాన్న చిన్నప్పట్నుంచీ పేదలకు సేవ చేయాలని, అందుకు సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించాలని చెబుతూవచ్చిన మాటలు నా మనసులో నాటుకుపోయాయి. పదవ తరగతి వరకు చిల్లకూరులోని ఎల్ఏపీ పాఠశాలలో చదివా. విజయవాడ శ్రీచైతన్యలో ఇంటర్, హైదారాబాదులోని ఐఐటీలో ఈసీఈ పూర్తిచేశా. గేట్‌లో ఎంపిక కావడంతో 2016లో హైదరాబాదులోని బీహెచ్ఈఎల్‌లో ఇంజనీరుగా చేరా. ప్రస్తుతం అదే కంపెనీలో సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నా.సివిల్స్‌లో ర్యాంకు సాధించాలన్న పట్టుదలతో ఉద్యోగం చేస్తూనే ఎక్కడా కోచింగ్ తీసుకోకుండా చదివి పరీక్షలు రాశా.నాల్గసారి పరీక్షలకు హాజరైన నాకు సివిల్స్‌లో 558వ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది.అయితే ఇండియన్ ఫారిన్ సర్వీస్‌కు ఎంపిక కావడమే నా లక్ష్యం.

భీమ్‌నగర్‌వాసికి 810వ ర్యాంకు


ధనంజయకుమార్

కల్లూరు, ఏప్రిల్ 16 : పులిచెర్ల మండలం 106 రామిరెడ్డిగారిపల్లి భీమ్‌నగర్‌కు చెందిన వి.ధనంజయకుమార్ సివిల్స్ ఫలితాల్లో 810వ ర్యాంకు సాధించారు.కృష్ణయ్య, ముత్యాలమ్మ దంపతుల కుమారుడైన ధనంజయకుమార్ ప్రస్తుతం కడపలోని ఎక్సైజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.తమ్ముడు వేణుగోపాల్ కల్లూరు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.పులిచెర్ల మండలంలోని కల్లూరు శారదా విద్యామందిర్‌లో 5వ తరగతి వరకు చదువుకున్న ధనంజయకుమార్ మదనపల్లె సమీపంలోని వలసపల్లి జవహర్ నవోదయలో 6నుంచి ఇంటర్ వరకు చదువుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తిలోని స్కిట్ కళాశాలలో ఈఈఈ గ్రూపులో బీటెక్ పూర్తిచేశారు. 2011వ సంవత్సరంలో విశాఖ ఉక్కు కర్మాగారంలో మేనేజర్‌గా చేరి సుమారు ఏడేళ్ల పాటు పనిచేశారు. 2016వ సంవత్సరంలో గ్రూప్-1 పరీక్ష రాసి 2018లో ఎక్సైజ్‌శాఖలో సూపరింటెండెంట్ ఉద్యోగం సాధించారు. మొదట అనంతపురంలో పనిచేసి ప్రస్తుతం కడపలో పనిచేస్తున్నారు.ఉద్యోగం చేస్తూనే కోచింగ్ తీసుకోకుండా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రిపేరయ్యారు.తాజాగా విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 810వ ర్యాంకు సాధించారు.


తమ్ముడు వేణుగోపాల్ , తల్లి ముత్యాలమ్మ, భార్య నిరూపతో ధనంజయకుమార్

అంబేడ్కర్ ఆశయాలతో ముందుకెళతా

ఐఏఎస్ సాధించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నా. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకెళతా. పేద విద్యార్థులను విద్యాపరంగా ఆదుకోవాలనుకుంటున్నా.

ఖాట్మండు వర్సిటీతో పద్మావతి వర్సిటీ ఎంవోయూ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 16: నేపాల్‌లోని ఖాట్మండు యూనివర్సిటీతో పద్మావతి మహిళా యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం చేసుకుంది. హైదరాబాదులో ఈ నెల 15 నుంచీ నిర్వహించిన వైస్ ఛాన్స్‌లర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ ఒప్పందం కుదిరింది.ఖాట్మండు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ బోలా తప, మహిళాయూనివర్సిటీ వీసీ భారతి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ఒప్పందంలో భాగంగా స్టూడెంట్స్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్‌తో పాటు రీసెర్చ్ కొలాబరేషన్, డ్యూయెల్ డిగ్రీ కోర్సుల నిర్వహణ చేయనున్నట్టు పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి వెల్లడించారు.రెండేళ్ళ పాటు ఈ ఒప్పంద కాల పరిమితి అని ఆమె తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలను పూర్తి చేయడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని అన్నారు.

శేషాచల అడవుల్లో మంటలు



తిరుమల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో మంగళవారం మంటలు రేగాయి. తిరుమలకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం, మొదటి ఘాట్‌రోడ్డుకు సమీపంలో వున్న సానరాళ్లమిట్ట వద్ద అడవికి నిప్పంటుకుంది.ఎండ తీవ్రతకు చెట్లు బాగా ఎండిపోయి వున్న క్రమంలో మంటలు వేగంగా వ్యాపించాయి.అటవీశాఖ, టీటీడీ ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది మంగళవారం రాత్రి ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మంటలు తిరుమల దిశగా రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు అడవిలో మంటలను ఆశ్చర్యంగా చూశారు.

ముక్కంటి సేవలో పీవీ సింధు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ముక్కంటీశుడిని దర్శించుకున్నారు.శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం మృత్యుంజయ మూర్తి సన్నిధిలో సింధూను వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరి యాదవ్, సీఎస్వో నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌కుమార్ రెడ్డిని ఓడించేంతవరకు నిద్రపోను

● ఆనం రామనారాయణరెడ్డి


టీడీపీలోకి ఆనం అనుచరులకు ఆహ్వానం


మాజీ మంత్రి ఆనంతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి/డక్కిలి, ఏప్రిల్ 16: భూమిపైన ఉన్న ఎర్రచందనం, ఇసుక, సిలికా, గంజాయితో పాటు భూమి లోపల వున్న మైకా, క్వార్ట్జ్ దోచుకొన్న వైసీపీ నేతలకు ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హెచ్చరించారు. వెంకటగిరి పట్టణంలోని ఎస్ఆర్ఎల్ కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పలువురు వైసీపీ అసమ్మతి నాయకులు టీడీపీలో చేరారు. సైదాపురం, రాపూరు, కలువాయి, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాలకు చెందిన వారికి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.వీరిలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, కౌన్సిలర్లు, ఏఎంసీ చైర్మన్లు, వైసీపీలో పలు కీలక పదవుల్లో వున్న నేతలు వుండడంతో టీడీపీలో జోష్ నెలకొంది.ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్,తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వరప్రసాద్, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ నానాజీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలో ఇప్పటివరకు పట్టుబడ్డ డబ్బంతా వైసీపీ వాళ్లదేనని తేలిందన్నారు.వెంకటగిరి వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని ఓడించేవరకు తాను నిద్రపోనని హెచ్చరించారు.ప్యాకేజీ తీసుకొని అసమ్మతి నేతలను టీడీపీలో చేర్పానంటూ చెబుతున్న ఆయన ఏ ప్యాకేజి జగన్‌కు ఇచ్చి జిల్లా ఇన్‌చార్జి పదవి, వెంకటగిరి టికెట్ తెచ్చుకున్నారో చెప్పాలన్నారు.ఐదేళ్ళ వైసీపీ దుర్మార్గపు పాలనలో ఎర్రచందనం, ఇసుక, మట్టి అక్రమ మైనింగ్, గంజాయి అక్రమ రవాణా మొత్తం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిధున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లో నడిచాయని ఆరోపించారు.రాష్ట్రంలో కాంట్రాక్టు పనులు దక్కించుకోవాలంటే ఎవరైనా ఈ ఐదుగురికి కమీషన్లు ఇస్తేనే పని జరిగిందన్నారు.ఈ దోపిడీ సొమ్ములో చాలాభాగం తాడేపల్లి ప్యాలెస్‌కే చేరిందన్నారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 16: జిల్లాలోని పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యవహారాల పర్యవేక్షణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులను నియమించింది.తిరుపతి పార్లమెంట్ పరిధిలోని సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలకు కర్ణాటకకు చెందిన కరీ గౌడను నియమించారు. తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు కర్ణాటకకే చెందిన ఉజ్వల్‌కుమార్ ఘోష్‌ను నియమించారు. చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని చంద్రగిరి, నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు కైలాష్ వాంఖేడ్‌ను నియమించారు. వీరు ఈనెల 25 నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు.

పోలీసు అబ్జర్వర్లుగా... : శాంతిభద్రతల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం పోలీసు అబ్జర్వర్లను నియమించింది. మహారాష్ట్రకు చెందిన అరవింద్ సాల్వే చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ పరిధిలోని సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, గంగాధర నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శాంతిభద్రతలను పర్యవేక్షించనున్నారు. ఈయన ఈనెల 25 నుంచి విధుల్లో ఉంటారు.

అభ్యర్థుల ఖర్చుల పర్యవేణకు.. : అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణకు ఐఆర్ఎస్ అధికారి ప్రదీప్ కుమార్‌ను నియమించారు. ఈయన తిరుపతి పార్లమెంట్ పరిధిలో బాధ్యతలు చూస్తారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మీనూవాలాను గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరికి,విజయ్‌శేషాద్రిని చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడుకు నియమించారు. వీరు గురువారం నుంచీ బాధ్యతలు చేపట్టనున్నారు. అభ్యర్థులు, ఓటర్లు ఏవైనా ఫిర్యాదులు చేయాలనుకుంటే వీరికి చేయవచ్చు.

సార్వత్రిక ఎన్నికలకు రేపే నోటిఫికేషన్

● నామినేషన్లకు అభ్యర్థితో కలిపి ఐదుగురికి మాత్రమే అనుమతి


వెంకటగిరిలో నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16:సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశారు.గురువారం నుంచి 25వ తేదీ వరకు సెలవు దినాలు మినహాయించి మిగిలిన రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ పత్రాల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ తరువాత బరిలో ఉన్న అభ్యర్థులను ప్రకటించనున్నారు. కాగా నామినేషన్ల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన నిబంధనలను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వివరించారు.అభ్యర్థులు గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, నామినేషన్ల దాఖలు సమయంలో వంద మీటర్ల పరిధిలో గరిష్ఠంగా 3 వాహనాలకు అనుమతి,ఐదుగురు వ్యక్తులు(అభ్యర్థి సహా) ఆర్వో కార్యాలయానికి రావొచ్చని సూచించారు.

పోస్టల్ ద్వారా ఎపిక్ కార్డుల అందజేత

● దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16: ఎపిక్ కార్డులను పోస్టల్‌శాఖ ద్వారా ఓటర్లకు పంపడం జరుగుతుందని ఒకవేళ తిరిగి వచ్చిన వాటిని సంబంధిత బీఎల్వోల ద్వారా మాత్రమే పంపిణీ చేయబడతాయని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.జిల్లాలో 2023 జనవరి 6వ తేదీ నుంచి 2024 మార్చి 30వ తేదీ వరకు మొత్తం 3,37,130 ఓటరు ఎపిక్ కార్డులను తయారు చేసినట్లు తెలిపారు. అందులో 3,14,710 ఎపిక్‌కార్డులను ప్రింట్ చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. కలెక్టరేట్ నుంచి పోస్టల్ శాఖ ద్వారా 2,65,823 ఎపిక్‌కార్డులను ఓటర్లకు పంపడం జరిగిందన్నారు.వాటిలో 12,875 ఎపిక్ కార్డులు వెనక్కు వచ్చినట్లు తెలిపారు. బీఎల్వోల ద్వారా 10,439 ఓటరుకార్డులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇంకా పంపిణీకి 2,436 ఓటరు కార్డులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి



మృతిచెందిన రాజేష్

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 16: అనుమానాస్పద స్థితిలో రాజేష్(30) అనే కార్మికుడు మృతి చెందిన ఘటన నాయుడుపేట - చెన్నై రహదారి సమీపంలోని అన్నమేడు క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం అరక్కోణంకు చెందిన రాజేష్ ఓజిలి మండలం పెద్దపరియ వద్ద ఉన్న ఓ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం తోటి కార్మికులైన శశికుమార్, శీనుతో కలిసి అన్నమేడు క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్లారు. అక్కడ ముగ్గురూ కలిసి మద్యం తాగారు. కొంత సమయం తరువాత అక్కడ నుంచి బయలుదేరారు. కొంత సేపటి తరువాత వస్తానని రాజేష్ చెప్పడంతో శశికుమార్, శీను వెళ్లిపోయారు. చీకటి పడినా రాజేష్ రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం పోలీసులు, కార్మికులు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పరిశీలించగా నదిలో తేలుతున్న రాజేష్ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని వెలికితీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ గోపీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

చిల్లకూరు, ఏప్రిల్ 16: చిల్లకూరు మండలంలోని గుత్తావారిపాళెం గ్రామ సమీపంలోని నందన అగ్రిఫామ్ తోటలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష పడినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని గుత్తావారిపాళెం సమీపంలోని నందన అగ్రిఫామ్ తోటలో రామసుబ్బయ్య(60) వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. అదేతోటలో బాలాయపల్లి మండలం సుబ్రమణ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, అతని భార్య నాగమ్మ పనిలో చేరారు. కొంతకాలం తరువాత పని మానేసి వెళ్లిపోవాలని, లేకపోతే చంపుతానని రామసుబ్బయ్యను వెంకటేశ్వర్లు బెదిరించేవాడు. 13 జూలై 2021న రామసుబ్బయ్య రక్తపుమడుగులో పడి తీవ్రగాయాలతో పడి ఉండడాన్ని అదే తోటలో పనిచేస్తున్న ఆవుల కాపరైన బాలయ్య గమనించాడు. వెంటనే రామసుబ్బయ్య కుమారుడు వెంకటేశ్వర్లుకు సమాచారం అందించాడు. అలాగే 108 వాహనంలో రామసుబ్బయ్యను నెల్లూరుకు, అక్కడి వైద్యుల సూచన మేరకు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలిస్తుండగా మార్గమధ్యంలో రామసుబ్బయ్య మృతిచెందాడు. ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తోటలో పనిచేస్తున్న సుబ్రమణ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు విచారించిన గూడూరు కోర్టు ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి నిందితుడైన వెంకటేశ్వర్లుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

ఉరేసుకొని ప్రైవేట్ బస్సు డ్రైవర్ మృతి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16: సూళ్లూరుపేటలోని ఝాన్సీనగర్‌లో కాపురం ఉంటున్న చేనిగుంట సతీష్(24) ఉరేసుకొని మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు... తమిళనాడు రెడ్‌హిల్స్‌కు చెందిన సతీష్ అదే ప్రాంతానికి చెందిన అశ్వినీని ప్రేమ వివాహం చేసుకొన్నాడు. రెండేళ్ల కిందట సూళ్లూరుపేటకు వచ్చి శ్రీసిటీలోని పరిశ్రమలకు వెళ్లే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఎస్ఐ రహీం రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలబావిలో పడిపోయిన జింక

కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



జింకకు చికిత్స చేస్తున్న అటవీశాఖ, అగ్నిమాపక సిబ్బంది

కోట, ఏప్రిల్ 16: కోట మండలం చిట్టేడు వద్ద ఉన్ననేలబావిలో ఓ జింక ప్రమాదవశాత్తు పడిపోయింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా అగ్నిమాపక సిబ్బంది ఆ జింకను కాపాడి ఊపిరిపోశారు. స్థానికుల కథనం మేరకు... చిట్టేడు, కేశవరం, అటవీప్రాంతాల నుంచి ఎండ తీవ్రతను తట్టుకోలేక దాహార్తిని తీర్చుకునేందుకు ఐదేళ్ల వయస్సు కలిగిన జింక చిట్టేడులో ఉన్న ఓ నేలబావి వద్దకు వచ్చింది. గట్టుపై నుంచి నీళ్ల తాగేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. స్థానికులు గుర్తించి కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి బావిలో నుంచి జింకను బయటకు తీసుకువచ్చి శస్త్రచికిత్స చేయించారు. అనంతరం జింక తేరుకోవడంతో కేశవరం అడవుల్లో వదిలిపెట్టారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని కార్మికుడి మృతి

బాలాయపల్లి, ఏప్రిల్ 16: గుర్తుతెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందిన సంఘటన బాలాయపల్లి మండలంలోని పెరిమిడి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తొట్టంబేడు మండలం చిన్న కనపర్తి గ్రామానికి చెందిన పులి మస్తాన్(38) నాయుడుపేట మండలంలోని మేనకూరులోని వెస్టేజ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పెళ్లకూరు మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం సొంత పని నిమిత్తం బాలాయపల్లి మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి వెళుతుండగా పెరిమిడి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తలపై తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ మహబూబ్ సుభాని సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి బాటలు వేద్దాం: పాశిం



జగన్‌మోహన్‌రెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పాశిం తదితరులు

కోట, ఏప్రిల్ 16: గత టీడీపీ హయాంలో ప్రతి మారుమూల గ్రామంలో సైతం అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించామని, మళ్లీ గెలిపిస్తే స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దుతామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. కోటలో మంగళవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా మాజీ సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డిని టీడీపీలోకి రావాలంటూ ఆహ్వానించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో రెండు రోజుల్లో నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి టీడీపీలో చేరనున్నారని తెలిపారు. దీంతో టీడీపీ నేతలు దశరథరామిరెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వాకా విజయభాస్కర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రమేష్, మురళీ, బాలాజీశెట్టి తదితరులు జగన్‌మోహన్‌రెడ్డి రాకను అభినందిస్తూ స్వీట్లు పంపిణీ చేశారు.

రాధాకృష్ణ అలంకారంలో బాలాంజనేయస్వామి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16: బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి వసంతోత్సవాల్లో భాగంగా మంగళవారం బాలాంజనేయస్వామి రాధాకృష్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు చేశారు. అదేవిధంగా బ్రాహ్మణవీధిలో సీతారాముల ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శ్రీరాముడు కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

చీటింగ్ కేసు నమోదు

తడ, ఏప్రిల్ 16: బాడుగకు కార్లు తీసుకొని ఉడాయించిన వ్యక్తిపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వరదయపాళెం మండలం ఇరుగుళం గ్రామానికి చెందిన బాబు కార్లను అద్దెకు తీసుకొని శ్రీసిటీలోని పరిశ్రమలకు సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో తడకు చెందిన గుణశేఖర్, అతని స్నేహితుల వద్ద ఉన్న మూడు కార్లను అద్దెకు తీసుకున్నాడు. రెండు నెలలపాటు అద్దె చెల్లించాడు. ఆ తరువాత కన్పించకుండా పరారయ్యాడు. అతని ఆచూకీ కోసం ప్రయత్నించగా కడపలో ఆ కార్లను కుదవ పెట్టినట్లుగా గుర్తించారు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, ఏప్రిల్ 16: కోట క్రాస్‌రోడ్డులోని చల్లకాలువ సమీపంలో పది మద్యం బాటిళ్లను బెల్టు తరలిస్తున్న శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

చంద్రబాబుతోనే ప్రజా శ్రేయస్సు: నెలవల

నాయుడుపేట, ఏప్రిల్ 16: చంద్రబాబు నాయుడుతోనే ప్రజా శ్రేయస్సు సాధ్యమని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం నాయుడుపేట పట్టణంలోని విజయగణపతి దేవస్థానంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల జనసందోహంతో పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం మాట్లాడుతూ వైసీపీ పాలనలో కౌరవ సభగా మారిన అసెంబ్లీ గౌరవ సభగా చూడాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాలని, ఇందుకోసం త్వరలో జరిగే ఎన్నిల్లో ఎన్డీఏ కూటమిని గెలిపించాలని కోరారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా డాక్టర్ నెలవల విజయశ్రీ, తిరుపతి ఎంపీగా వెలగపల్లి వరప్రసాదరావును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. విజయశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉంటూ సంక్షేమం, అభివృద్ధి పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ పీఎంగా, రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉంటేనే ప్రగతి సాధ్యమన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు అష్టకష్టాలు పడ్డారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు భద్రత ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగినేని కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జంపాల మాల్యాద్రి నాయుడు, మాజీ కార్యదర్శి ఆశ చెంచుకృష్ణయ్య, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిగురాకుల సురేంద్రబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు ఉగుమూడి భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, నానాబాల సుబ్బారావు, అవధానం సుధీర్, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, గాలి రాజేష్‌నాయుడు, దార్ల రాజేంద్ర, ధనంజయరెడ్డి, గూడూరు సుధీర్‌రెడ్డి, నిత్యా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో విజయశ్రీ, నెలవల, పరసా, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

విజయమే లక్ష్యంగా పనిచేద్దాం: వరప్రసాద్



బీజేపీ నాయకులతో ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు

తిరుపతి,(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 16: కేంద్రంలో మరోసారి బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు కోరారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జి, నియోజకవర్గ అధ్యక్షులు, మండల అధ్యక్షుల సమావేశం రాష్ట్ర ఎన్నికల కోఆర్డినేటర్ శేఖర్‌జీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధి జరగాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, పామంజి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, లీగల్‌సెల్ అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రప్ప, వరప్రసాద్, నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, వినీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనసేన జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌ను ఆయన నివాసంలో వరప్రసాదరావు కలుసుకున్నారు. ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు అందరూ సహకరించాలని కలసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా వరప్రసాద్‌ను నియమించడం సంతోషకరమన్నారు.

వైసీపీ పతనం ఖాయమైంది

వెంకటగిరి: అరాచక వైసీపీ ప్రభుత్వం పతనం అంచున ఉందని, రాబోయేది ఉమ్మడి ఎన్డీఏ ప్రభుత్వమని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. మంగళవారం టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థుల సమన్వయ కమిటీ సమావేశం మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వరప్రసాద్ మాట్లాడుతూత్వరలో జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కొండేపాటి గంగాప్రసాద్, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి ఆనం, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, లక్ష్మీసాయిప్రియ, వరప్రసాదరావును సత్కరిస్తున్న నాయకులు

గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 16: టీడీపీ అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఎస్ఆర్పీ సెంటర్ ప్రాంతంలో ఆయన సతీమణి సంధ్యారాణితో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులంటే సీఎం జగన్‌కు చిన్నచూపన్నారు. దళిత యువకులకు శిరోమండలం చేసిన కేసులో విశాఖ ఎస్సీ, ఎస్టీ సిటీ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అన్నారు. దళితులను అవమానించిన వారికి పదవులు ఇవ్వడం జగన్ పైశాచికానికి నిదర్శనమన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడంతో పాటు ఐటీ రంగాన్ని అభివృద్ధిపరిచి ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రానికి, యువతకు భవిష్యత్తు ఉండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో అందరం ఏకమై వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించి ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, చాన్‌బాషా, కేశవ, ఉమాశంకర్, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, గుండాల లీలావతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకూ హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు

టీడీపీ అధికారంలోకి రాగానే ప్రైవేటు పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక రెండో పట్టణ పరిధిలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ప్రైవేటు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. స్థానికంగా ఉండే వారిని ఎన్నుకుంటే నిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. వలస పక్షులను నమ్మి మోసపోకుండా రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని సునీల్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో బాలకృష్ణమనాయుడు, దశరధరామిరెడ్డి, చంద్రమోహన్, పవన్‌కుమార్, నవకోటినాయుడు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, అబ్దుల్ రహీం, బిల్లు చెంచురామయ్య, చాన్‌బాషా, కేఆర్‌రెడ్డి, రూపవతి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అడుగంటిన అభివృద్ధి: పరసారత్నం



సమావేశంలో మాట్లాడుతున్న పరసా రత్నం

పెళ్లకూరు, ఏప్రిల్ 16: గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అడుగంటిదని, ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి పరసారత్నం విమర్శించారు. మంగళవారం ఆయన ఊడిపూడిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధినేత పాలనలో మండలంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. అన్ని గ్రామాలకు కోట్లాది రూపాయల నిధులతో వాగులు, చెరువుల పూడికతీత, పేదలకు ఇళ్లు, నాణ్యమైన రోడ్లు తదితర మౌలిక సదుపాయలను కల్పించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు సమసిపోవాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని.. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. నెల్లూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రంగినేని కృష్ణయ్య మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని తెలిపారు. కార్యక్రమంలో వేలూరు హరినాయుడు, సిద్దులయ్య నాయుడు, గుంటమడుగు సుగుణమ్మ, పాలచ్చూరు సుబ్బరామయ్య, అక్కరపల్లి మాధవరెడ్డి, మరుపూరు మస్తాన్‌రెడ్డి, తాళ్ల యుగంధర్, నెలవల ప్రసాద్‌యాదవ్, గంగాబత్తిన రామకృష్ణ, గురవయ్య, పునబాక పోలయ్య, వేలూరు రమణయ్య, దామతోటి సుబ్రహ్మణ్యం పరుశురాం, సురేష్, బాలరాజు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోండి

చిల్లకూరు, ఏప్రిల్ 16: ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని నోడల్ అధికారిణి కాంచన అన్నారు. మంగళవారం స్థానిక గురుకుల పాఠశాల నుంచి దర్గా వరకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధంలాంటిదని, ఉత్తమ నాయకుడుని ఎన్నుకుని దేశాభివృద్ధి భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, ఎంఈవో రఫూఫ్, మునిరత్నం, మీరా సాహెబ్, రమ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

కోట, ఏప్రిల్ 16: మండల పరిధిలోని ఉత్తమ నెల్లూరు వద్ద మోటారు బైక్, ఐస్‌క్రీమ్ విక్రయించే వాహనం ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. కోటకు చెందిన రమణయ్య చింతవరంలోని పశువుల ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు మోటారు బైక్‌లో వెళ్తుండగా ఉత్తమ నెల్లూరు వద్ద ఐస్ విక్రయించే వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదవంలో రమణయ్య గాయపడడంతో కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్

గూడూరు, ఏప్రిల్ 16: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభచాటిన స్థానిక నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ జనార్దన్ మంగళవారం అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో తమ కళాశాల ఎంపీసీ విభాగం నుంచి మేఘన 466 మార్కులు, బైపీసీ విభాగం నుంచి నిహార్ 434 మార్కులు సాధించారన్నారు. అదేవిధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో అన్వేష్ రెడ్డి 987 మార్కులు, కావ్య 970మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో ఏజీఎం హజరత్ నాయుడు, డీన్ శ్రీనివాసులు, ఏవో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో ఎస్ఈబీ తనిఖీలు

తడ, ఏప్రిల్ 16: ఎస్ఈబీ జాయింట్ కమిషనర్ అరుణ్‌కుమార్ తడ మండలంలోని బీవీపాళెం చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం తడకు వచ్చిన ఆయన చెక్‌పోస్టులో రికార్డులను పరిశీలించారు. అక్కడ నుంచి ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి, వాహన తనిఖీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్ఈబీ ఎఈఎస్‌లు నరసింహారావు, రమేష్ తదితరులు ఉన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కోట, ఏప్రిల్ 16: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ ఆధ్వర్యంలో ఈ నెల 27న జరిగే నేక్సస్‌వర్క్స్ జాతీయ సాంకేతిక సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ మంగళవారం జరిగింది.

టీడీపీతోనే అన్నివర్గాలకు న్యాయం: విజయశ్రీ

పెళ్లకూరు, ఏప్రిల్ 16: టీడీపీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ అన్నారు. మండలంలోని రోసనూరు, కృష్ణప్పకండ్రిగ, బంగారంపేట, మోదుగులపాలెం, ఊడిపూడి తదితర గ్రామాల్లో మంగళవారం ఎన్డీఏ కూటమి నేతలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ త్వరలో జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని తెలిపారు. అప్పుడే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రచారంలో భాగంగా రోసనూరు గ్రామంలో మిరప తోటలో పనిచేస్తున్న రైతులు, కూలీలతో విజయశ్రీ మాట్లాడారు. మిరప రైతుల సమస్యలు, గిట్టుబాటు ధరల గురించి ఆమె ఆరాతీశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పూర్తి సబ్సిడీతో రుణాలను అందించడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత, నెల్లూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రంగినేని కృష్ణయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు పేరం రమేష్‌నాయుడు, వట్టికుండల శేఖర్‌నాయుడు, కందమూడి శివకుమార్, దొమ్మరాజు సతనారాయణరాజు, చింతా సతీష్‌చంద్ర, దార్ల రాజేంద్ర, కేవీనాయుడు, నూతలపాటి ప్రసాద్‌నాయుడు, నర్రావుల మోహన్‌నాయుడు, వెంపళ్ల వెంకటేశ్వర్లు, దువ్వూరు కృష్ణయ్య, ఇరుగు వెంకటసుబ్బయ్య, నల్లు కస్తూరమ్మ, గంగాబత్తిన శివరామయ్య, పుట్టు, గురవయ్య, గుంటపూడి గురవయ్య, గోను ముత్యాలయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ఎన్డీఏ కూటమి విజయం తథ్యం: జనసేన



ప్రచారంలో కూటమి నాయకులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 16: రానున్న ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయం సాధించడం తథ్యమని జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం గూడూరు మండలంలోని కాండ్ర గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, నవీన్‌రాజు, జగదీష్, మణి, మోహన్, భూపతి, శ్రీనాథ్, పెంచలయ్య, ప్రభాకర్, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

కోట, ఏప్రిల్ 16: వైసీపీ వైఫల్యాలను గడప గడపకు తీసుకువెళ్లి ఓటర్లను చైతన్యపరచాలని తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తీగల సురేష్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జి పాదర్తి కోటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జరుగుమల్లిలో మంగళవారం జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలన్నదే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఆ దిశగా ముందుకుసాగాలని బీసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కందల బాలకృష్ణయాదవ్, చాపల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

పెళ్లకూరు, ఏప్రిల్ 16: మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో ఉన్న ఓ ప్రైవేట్ ఐరన్ పరిశ్రమలో గాయపడిన కార్మికుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. బీహార్‌కు చెందిన పరమేశ్వర్ కుమార్(28) ఈనెల 13న పెన్నేపల్లి ఐరన్ పరిశ్రమలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఐరన్ లిక్విడ్ మెటల్ బ్లాస్ట్ అవడంతో ప్రమాదానికి గురయ్యాడు. తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి మినీ లారీ బోల్తా

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 16: నాయుడుపేట - మేనకూరు వెళ్లే స్వర్ణముఖి బ్రిడ్జిపై మినీలారీ అదుపుతప్పి నదిలో బోల్తా పడింది. మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారం నుంచి మెటీరియల్ తీసుకువచ్చేందుకు మంగళవారం నాయుడుపేట నుంచి మినీలారీ బయలుదేరింది. స్వర్ణముఖి బ్రిడ్జిపై వెళ్తుండగా అదుపుతప్పి నదిలో పడిపోయింది. లారీ డ్రైవర్ వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 16: మండలంలోని పారిచెర్ల గ్రామం, గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల వద్ద మంగళవారం అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలు మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపకశాఖ అధికారి చలమయ్య మాట్లాడుతూ వంట చేసుకునే సమయంలో గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన పైపులు లీక్‌కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిగరెట్ పీకలను పూర్తిగా ఆర్పేసి చెత్తాచెదారాలు లేని ప్రాంతాల్లో వేయాలని సూచించారు.కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తేజ హైస్కూల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మాక్‌డ్రిల్ చేసి చూపించారు. అనంతరం షార్ బైపాస్ జంక్షన్ వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్‌లో మంగళవారం అగ్నిమాపక వారోత్సవాలు జరిగాయి. అగ్నిమాపక అధికారి హరీష్ ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్ వద్ద అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు.